తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక


జులై-2021
వెల: రూ.20





'పన్'చదార చిలుకలు


విచిత్ర విందు

లాఫ్ లైన్స్





నెమ్మదైన కోడలు
కావాలన్నావు కదమ్మా!!


వ్యాక్సిన్ వేయించు
కోని వాళ్ళని ఎక్కించు
కోమని ముందే
చెప్పిచావొచ్చుగా!!


కరోనా తొలిరోజుల్లో యాక్సిడెంట్లో
జ్ఞాపకశక్తి పోయింది.. ఈ కరోనా గొడవ
ఎందుకులే అని ప్రస్తుతానికి ట్రీట్‌మెంట్
ఇప్పించడం ఆపేశాం!!




హలో.. నేను ఐటి డిపార్ట్‌మెంట్
నుంచి మాట్లాడుతున్నా.. నిన్న
మీ షాపులో లలిత అని
ఒకావిడ డైమండ్ నెక్లెస్ కొనుక్కెళ్ళింది..
కెన్ యూ టెల్ మీ హర్ అడ్రస్ ప్లీజ్!!


శత్రు సైనికులను ఎదుర్కోడానికి అన్నిసిద్ధం
చెయ్యమంటే సొరంగమార్గం శుభ్రం
చెయ్యమనిరా మూర్ఖుడా!!

## ఓయ్...హాసనందంగా...



**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు హాస్యాభివందనాలు.**

ఈ మధ్య మనకి బాగా అలవడిన ఒక గుణం- జీవకారుణ్యం.

ఇది మంచి గుణమే కానీ ఆ కారుణ్యం సాటి మనుషులపై చూపించక పోవటమే బాధాకరమైన విషయం.

ముఖ్యంగా 'నేడు' కుక్కలకి ఇస్తున్న ప్రాధాన్యత మరీ మితిమీరి పోతున్నది. వాటి ఆలనా పాలనా కోసం వేలకు వేలు వెచ్చిస్తున్న ఈ మహానుభావులు, జన్మకారుణ్యంపై దృష్టి సారించటం లేదు. జన్మనిచ్చిన తల్లి దండ్రులను వృధాశ్రమాల్లో చేర్పించేసి, ఓ కుక్కను పెంచు కుంటూ, వాటి సంరక్షణ కోసం ఒక 'కేర్‌టేకర్'ని నియమించుకుని, ఎంతో కాలాన్ని, డబ్బుని వెచ్చిస్తూ కాలం గడుపుతున్నారు ఈ సోకాల్డ్ కారుణ్యమూర్తులు. జంతువులని పెంచడం తప్పని నేనటం లేదు... కానీ మనమీ రోజు ఇలా ఉన్నందుకు కారకులైనవారిని నిర్లక్ష్యం చేస్తూ... వారికింద 'వేలకి వేలు' ఖర్చు చేస్తున్నాం అని గర్వపడే వారిగర్వం నిరర్థకం! ఎంతోమంది 'సహాయం' కోసం అలమటించేవారిని ఒక కంట కనిపెడితే... వారికి ఒక పూట తిండి పెడితే... ఆ కుక్కకి వాడే 'షాంపూ' ఖర్చు కూడా అవదు. జంతువుల పట్ల 'కారుణ్యమే కాకుండా సాటి మనిషి పట్ల కూడా మానవత్వం చూపిద్దాం! అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...

Ramu P

> **గమనిక:**
> ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.


స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్ఛమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జులై-2021
19వ సంవత్సరం ✦ 205 వ సంచిక

**సంపాదకులు: రాము.పి**

నవ్వుకు కారణం అవసరం!

*Publisher& Editor*-Ramu. P

*Full Pillar*- Bnim

*Well Wishers:*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Mallik, Sanku

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Perpetuals:*
A.Dayakar, Lepakshi, Bannu, Bachi, Krishna, Nagisetty, Nagraj, Venkat.




ముఖచిత్రం: రాశిఖన్నా
కార్టూన్: కృష్ణ


| |
|---|
| సంవత్సర చందా- రూ.300/-(పోస్టల్ చార్జీలతో) |
| 2 సంవత్సరాల చందా- రూ.500/-(పోస్టల్ చార్జీలతో) |
| జీవిత చందా- రూ.5000/-లు |



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

**Hyderabad & Secunderabad Distributors:**
M.Panduranga, **Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.

email: hasyanandam.mag@gmail.com / web: www. hasyanandam


Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏ ఏ నవ్వులున్నాయో...

## కథలు


| | | |
|---|---|---|
| నారికేళి | 'భారద్వాజ' | -16 |
| కొత్తిమీర కట్ట | ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | -22 |
| దయ్యోపాఖ్యానం | దంతులూరి వర్మ | -28 |
| బాస్ ఆన్‌లైన్ మీటింగ్ | డా॥ డి.ఎన్.వి. రామశర్మ | -34 |
| గుబులు కుమారి | కోనే నాగవెంకట ఆంజనేయులు | -37 |
| శకునాల శంకర్రావు | బుద్ధవరపు కామేశ్వరరావు | -40 |
| పెళ్ళి బాగోతం | భాగవతుల భారతి | -44 |


## సీరియల్స్


| | | |
|---|---|---|
| లక్కీఫెలో | జి.రవికిరణ్ | -10 |
| విచిత్ర విందు | పుట్టగుంట సరేష్ కుమార్ | -18 |
| ఇందు చందు-నవ్వులవిందు | కంఠ్లకుంట శరత్‌చంద్ర | -46 |

**శ్రీ అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు-14**


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈ నెల ప్రోత్సాహక బహుమతులు | | -5 |
| 'పన్'చదార చిలుకలు | శంకర్‌నారాయణ | -9 |
| తర్కారావు కథలు | గంగాధర్ వడ్లమన్నాటి | -21 |
| ఫన్‌పంచ్ | గుండు సుదర్శన్ | -26 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -32 |
| మాటల్లేవ్... | | -45 |
| చావు ప్రేమ | దయాకర్ | -50 |

**లాఫ్‌లైన్- కంఠ్లకుంట శరత్‌చంద్ర**


**కథలకు బొమ్మలు:** ఉత్తమ్, కృష్ణ, దయాకర్, వెంకట్, హరగోపాల్, విశ్వాస్, సంగ్రామ్.





## జన్మదిన శుభాకాంక్షలు


హాస్యానందం ఆత్మీయులు
మా శ్రేయోభిలాషి
**శ్రీ తనికెళ్ల భరణి గారికి**
జన్మదిన శుభాకాంక్షలు




తెలుగు కార్టూనిస్టుల పండగకి తోరణంగా విరాజిల్లుతూ శోభలు కురిపిస్తున్న మా సత్కళాభారతి **శ్రీ సత్యనారాయణ గారికి** జన్మదిన శుభాకాంక్షలు
















## ఈ సంచికలో కార్టూనిస్టులు

- ఉత్తమ్
- బాచి
- కృష్ణ
- హరగోపాల్
- దయాకర్
- చక్రవర్తి
- రామ్‌శేషు
- ఎన్.ధీరజ
- శేఖర్
- అత్తలూరి
- పూర్ణ
- శర్మ
- మాంటిక్రిస్టో
- బండి రవీందర్
- పుష్ప
- వందన శ్రీనివాస్
- రఘు
- ఎమ్.ఎ.రవూఫ్
- అయ్యప్ప
- శ్రీకర్
- శ్రీలోచన్
- టి.ఆర్.బాబు
- దొరశ్రీ
- ప్రేమ్
- శంబంగి
- తోపల్లి ఆనంద్
- వడ్డేపల్లి వెంకటేష్
- పద్మ
- దాస్
- నాథ్
- షేక్ సుభాని
- జె.ఎన్.ఎమ్.
- నూతి
- టి.భాస్కర్
- సునీల్
- వినోద్
- నాగిశెట్టి
- వి.నాగ్రాజ్
- జాకీర్
- డి.శంకర్
- కన్నాజిరావు
- కాజ ప్రసాద్
- శ్రీ
- సి.ఎస్.కె.
- పూర్ణ
- పెండేల

# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

## ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్ ! / ప్రోత్సాహక బహుమతి: రూ.1000/-

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.



ఈ నెల బెస్ట్ కార్టూనిస్ట్-**ఎన్. ధీరజ** — **కార్టూన్ 51 వ పేజీలో**




కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం** కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-** ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు& ప్రశంసాపత్రం** **శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు** అందజేస్తున్నారు.



ఈ నెల పురస్కార గ్రహీత – **కామేష్**




కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్. (జె.శ్రీరామచంద్రమూర్తి గారు)** వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**









కార్టూనిస్టులపై ప్రేమతో, వాత్సల్యంతో **శ్రీకుప్పచ్చి సుందరేశయ్య, శ్రీమతి సత్యవతి** (కోవూరు) **వార్లు** కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**




✦ **బి.ఎమ్.పి.సింగ్, విజయవాడ**

**కం**టికి కానరాని ఓ 'క్రిమి'నల్ వల్ల నేడు నలు వైపులా అలుముకున్న 'కరోనా కారు చీకటిని' చీల్చి, పాఠకుల వాకిట వెలుగులు నింపే నవ్వుల దివ్వెల సమాహారం...హాస్యానందం'. మసకబారిన మనసు లకూ ఆరోగ్యకరంగా ఆనందాన్నందించే ఓ 'హ్యాపీ శానిటైజర్' గా కూడా మారింది ఇది. ప్రస్తుతం 'హ్యాండ్ వాష్'లతో మనిషికి కేవలం ఓ రెండు నిమిషాలే రక్షణ. కానీ హాస్యానందం అందించే 'మైండ్‌వాష్'తో 30 రోజులు గ్యారంటీగా రక్షణ! 'ఆరోగ్యమే మహాభాగ్యం' అయితే... 'హాస్యానందమే' అస్సలైన ఆరోగ్యం. రోజూ దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే కరోనా కేసుల 'స్కోరు', మరణాల జోరు వంటి విషాదకరమైన వార్తల్ని టీవీల్లో విని, వినీ విసిగిపోతున్న మాకు 'హాస్యా నందం' అక్షరాల మాటల్లో చెప్పలేనంతా ఆనందాన్ని 'పంచ్'తూనే, పలుబాధలతో బరువెక్కే గుండెల భారాన్ని తగ్గించే మాసపత్రిక 'హాస్యానందం' ఓ మానస పుత్రి కగా కూడా మా 'అభిమాన పత్రిక' అని తెలియజేయుటకు ఆనందిస్తు న్నాను. హాస్యానందం ఇలాగే సర్వదా...హ్యూమరస్‌గా, గ్లామరస్‌గా ఓ నూ'తన'గ్రామర్‌తో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను.



✦ **హెచ్. ప్రమీలారాణి, బెంగళూరు**

**జూ**న్ హాస్యానందం అద్భుతంగా ఉంది. ముఖ్యంగా ముఖచిత్రం చాలా బాగుంది. హాయ్...సానందంగా నుండి మా హితార్థం జారీ చేసిన ప్రకటన వరకు పత్రిక రూపకల్పన బాగుండి, అన్ని పేజీలు ఆకట్టుకున్నాయి. గుండు సుదర్శన్‌గారి పంచ్ సమాధానాల్లో 'ఫెళ్ళున' ఎవరు నవ్వగలరో చెప్పిన తీరు బాగుంది. ఆయన లౌక్యానికి జోహార్లు.

✦ **ఆర్.నారాయణరావు, కోరుట్ల**

**హా**స్యానందం... మా అందరి ఆనందాలను పెంచుతున్న దివౌషధం. ఎలాంటి అభ్యంతరకరమైన హాస్యం లేకుండా వెలువడుతున్నందుకు హాస్యానంద మంటే మాకు ఇష్టం. జూన్ సంచికలో ప్రచురించిన ముళ్ళపూడివారి హాస్య కథల పోటీలో గెలుపొందిన 15 కథలను ఒకే సంచికలో ఇవ్వటం బావుంది. సంపాదకులు చెప్పినట్లు ఆ కథలకు మరింత అందాన్ని సంతరింపజేసాయి బ్నిం గారి బొమ్మలు. మా హితార్థం జారీ చేసిన ప్రకటనకర్త- శ్రీ సత్యనారాయణగారికి కృతజ్ఞతలు. మీకు అభినందనలు.

✦ **పద్మకుమారి వేజెళ్ల, గూడూరు.**

**తె**లుగువారి ఏకైక హాస్య పత్రిక హాస్యానందం. మా కుటుంబానికి నచ్చిన ఏకైక పత్రిక హాస్యానందం. ఈ కరోనా కాలంలో మాకు తోడు నిలిచిన పత్రిక- హాస్యానందం... అందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్న పత్రిక... మా అభిమాన పత్రిక హాస్యానందం పది కాలాల పాటు ఇలానే వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాం.

✦ **హెచ్.కృష్ణకుమారి, హైదరాబాద్**

**జూ**న్ హాస్యానందంలో ఎడిటర్ గారు చెప్పినట్లు... ధైర్యంగా ఉండి, మంచి వ్యాపాకాలతో బిజీగా ఉంటూ, హాయిగా నవ్వుతూ ఇమ్యూనిటిని పెంచుకుంటూ కరోనాని జయిద్దాం' అన్నమాటలు మంచి స్ఫూర్తి దాయకం! ఈ సంచికలో సుదర్శన్‌గారి 'ఫన్‌పంచ్' ఆయన వాక్చాతు ర్యానికి నిదర్శనం. మీ శ్రద్ధ ప్రతి పేజీలో కనిపిస్తుంది. పత్రిక మా నవ్వుల పుత్రికగా మారిపోయిందంటే నమ్మండి!



**వచ్చే సంచిక... అంటే...**
**ఆగష్టు, 2021 హాస్యానందం**
**ప్రముఖ కార్టూనిస్ట్, సినీ దర్శకులు**
**శ్రీగాంధీగారి ప్రత్యేక సంచికగా**
**రూపుదిద్దుకుంటుంది...**
**ఆయన కలం పకపకలు...**
**కుంచె కితకితల విన్యాసాలను**
**హాస్యానందం**
**ఆగష్టులో ఆవిష్కరిస్తోంది.**

# హాస్యానందం సౌజన్యంతో కార్టూన్ పోటీలు




ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు,
తమ తల్లిగారు శ్రీమతి అన్నం భాగ్యవతి(బాచి)గారి
స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు
నిర్వహిస్తున్నారు.

మొదటి బహుమతి
రూ.5000/-లు+ మెమెంటో+ సర్టిఫికేట్
రెండవ బహుమతి రూ.3000/-లు+ సర్టిఫికేట్
మూడవ బహుమతి రూ.2000/-లు+ సర్టిఫికేట్
పాల్గొన్నవారందరికీ సర్టిఫికేట్లు.

హాస్యాభిమాని, కార్టూనిష్టులు
**శ్రీఎస్.వి.రమణ,(హైదరాబాద్)గారు** తమ తల్లిదండ్రులు
**శ్రీసోమయాజుల శివరామయ్య, శ్రీమతి హైమవతి గార్ల**
స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు.




| | |
|---|---|
| మొదటి బహుమతి- | రూ.2500/- |
| రెండవ బహుమతి- | రూ.1500/- |
| మూడవ బహుమతి- | రూ.1000/- |

**ఒక ప్రముఖ కార్టూనిస్ట్‌కి సన్మానం**

ముఖ్య గమనిక:

✦ ఈ కింది మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను!

**sreedhar.annam@yahoo.in**

✦ రెండు పోటీలకు విడివిడిగా కార్టూన్లు పంపవలెను.


**కరోనా లాక్‌డౌన్ల వలన బహుమతి ప్రదానోత్సవ సభ ఎప్పుడు నిర్వహించేది ఆగష్టు హాస్యానందం సంచికలో తెలియజేస్తాం!**

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : **20-07-2021**





**కార్టూన్ వాచ్ మ్యాగజైన్ మరియు ఛత్తీస్‌గర్ పర్యావరణ పరిరక్షణ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ" పై జాతీయ స్థాయి కార్టూన్‌ల పోటీలో బహుమతులు గెలుచుకున్న మన తెలుగు కార్టూనిస్టులు.**


మొదటి బహుమతిపొందిన కార్టూనిస్టు-**కృష్ణ**





స్పెషల్ బహుమతులు పొందిన వారు-

**నాగిశెట్టి, వర్చస్వీ, గుత్తుల శ్రీనివాసరావు, ధీరజ**








# 'పన్'చదార చిలుకలు

'హాస్యబ్రహ్మ' డా॥ శంకర్‌నారాయణ





గూగుల్‌బ్రహ్మ,
గూగుల్ విష్ణు,
గూగుల్ దేవో మహేశ్వరః,
గూగుల్ సాక్షాత్ పరబ్రహ్మ
తస్మైశ్రీ గూగుల్‌వే నమః!



వెంకన్న గుండు బలం...
మనిషికి గుండె 'బలం'!



ట్యూబులందు యూట్యూబులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ!



సరస్వతి కరుణిస్తేనే 'పలుకు'బడి!



తుపాకి పట్టుకుంటే 'గన్'దరగోళమే!




బడి అంటే
మేనేజ్‌మెంట్‌కి రా'బడి'...
పిల్లలకు మొక్కు'బడి'!



బిజీ చదువుల్లో అంతా 'బిజీ'నెస్సే!




బెండ్ కాకతప్పనివాడు హజ్'బెండ్'!



ఏ టు జడ్ మధ్యలో 'క్యూ'!



భార్య 'శారీ' అంటే...
భర్త 'సారీ' అంటాడు.




వందమంది కొడుకులున్నా...
'సన్'లైట్ లేనివాడు ధృతరాష్ట్రుడు!



చదువులు వచ్చిన వాళ్ళకే
'చదివింపు'లు!

*Cartoons: Ramseshu*

సీరియల్




**"కిషోర్! మహేష్‌కి ఫోన్ చెయ్! చెబుతా!!" అంది స్వాతి.**

**"వాడు ఫోన్ చేసినా రాడు!" అన్నాడు.**

**"నీకు తెలియదు వస్తాడు! ఫోన్ చేయ్!!" అంది స్వాతి.**

**అనుమానంగా చూసాడు కిషోర్.**

**"ఏదో మర్చిపోయినట్లు మగాళ్ళు నటిస్తారు. కాని ఆ అటాచ్‌మెంట్‌ను వదులుకోలేరు. ఒకసారి కమిటయ్యాక కనెక్షన్ కట్ అవడం కష్టం. ప్రేమను నటించినా తర్వాత జీవించేస్తారు. ఆ తర్వాత మరో ప్రేమలో పడి దీన్ని మర్చిపోతారు... కాని అదే ప్రేమను మళ్లీ గుర్తు చేస్తే తిరిగొస్తారు!" అంది స్వాతి.**

స్వాతి వంక అభిమానంగా చూసాడు కిషోర్.

"ఇన్ని తెలివితేటలు నీకున్నాయ్ కాబట్టి నాకు ప్రాబ్లెమ్ లేదిక!" అన్నాడు కిషోర్.

"సరేగాని ఫోన్ చేసి మదాలస చచ్చిపోయిందని చెప్పు!" అంది స్వాతి.

"ఏంటీ!?" అని ఏదో అర్థమైనట్లు తలూపాడు కిషోర్.

మహేష్‌కు ఫోన్ చేసాడు కిషోర్.

"హలో మహేష్! ఎక్కడున్నావ్‌రా? ఎప్పటినుంచి ట్రై చేస్తున్నాం నీకు..."

"నేను ఇప్పుడే సిటీలో ఎంటరయ్యా. వచ్చేస్తున్నా. ఏంటి విషయం?" అడిగాడు మహేష్.

"మదాలస..." అని ఆగాడు కిషోర్.

"ఆఁ! మదాలస నీకు ఫోన్ చేసిందా ఏంటి? ఓ తెగ ఫోన్లు రెండు రోజులనుంచి... వారం రోజులు బిజీ అని చెప్పినా వదలదే!" అన్నాడు చిరాగ్గా మహేష్.

"నీకు ఇక ఫోన్ రాదులే. నీకే కాదు ఎవరికీ రాదు!" అన్నాడు కిషోర్.

"అదేంటీ ఫోన్ పోయిందా?" అడిగాడు మహేష్.

"నీయబ్బ! మదాలసే పోయింది!!" అన్నాడు కిషోర్.

"ఊరుకోరా!... ఫోన్ కొట్టేస్తున్నారు గాని... మదాలసను ఎవరు కొట్టేస్తారు!" అన్నాడు మహేష్.

కిషోర్ తల పట్టుకున్నాడు.

స్వాతి ఫోన్ తీసుకుని– "మహేష్ మదాలస చనిపోయింది. మాదాపూర్ స్టార్ ఆస్పత్రిలో వుంది. వెంటనే రా!... ఎందుకులే గొడవ అనుకుంటే రామాకు! మేము వాళ్ళ పేరెంట్స్‌కి కబురు పెట్టాం... వాళ్ళు దారిలో ఉన్నారు. కాసేపట్లో వచ్చి తీసుకెళ్తారు." అంది.

"అదేంటి చనిపోవడమేమిటి?... ఏం మాట్లాడుతున్నావ్?" అరిచాడు మహేష్.

"అవును! నీ ప్రేమ కిక్ ఎక్కువై తట్టుకోలేక చచ్చిపోయింది!" అంది స్వాతి కోపంగా.

"స్వాతి నిజం చెప్పు! కిషోర్‌కి ఫోనివ్వు." అన్నాడు మహేష్ టెన్షన్‌గా.

"టెన్షన్ పడకు!... అంతా అయిపోయింది. నీకే ప్రాబ్లెమ్ లేకుండా కిషోర్ ఇక్కడ మానేజ్ చేసాడు. వస్తే రా! లేకపోతే లేదు..." చెప్పి ఫోన్ పెట్టేసింది స్వాతి.

"అదేంటి?... రమ్మంటేనే రాడు వాడు... వద్దంటే వస్తాడా?" అడిగాడు కిషోర్.

**ఇంతకు ముందు...** మహేష్, కిషోర్ ఇద్దరు స్నేహితులు. ఒకే ఆఫీసు, ఒకే ఇల్లు. కానీ ఇద్దరి మనస్తత్వాలు వేరు వేరు. మహేష్ చాలా స్పీడు. కిషోర్ నెమ్మదస్తుడు, భయస్తుడు కూడా! ఆఫీసులో బాసు పి.ఎ. అంటే ఇష్టం కానీ చెప్ప లేదు. కలల్లో ఆమెతో విహరిస్తుండం, కబుర్లు చెప్పడం లాంటివి చేస్తుంటాడు. మహేష్ అలా కాదు. రోజుకో అమ్మాయితో షికార్లు, కాలక్షేపలు చేస్తుంటాడు. **తర్వాత...**

"మీకు మా గురించి తెలియదు. కాని మాకు మీ గురించి బాగా తెలుసు. వస్తాడు చూడు!" అంది స్వాతి.

కాసేపటికి చెమటలు కక్కుతూ టెన్షన్‌గా మహేష్ వచ్చాడు.

బయట కారులో కోమలి కూర్చుని ఉంది.

రావడం రావడం కిషోర్‌ని పట్టుకుని–

"ఏమైందిరా!?...మదాలస మదాలస నిజంగానే చనిపోయిందా?" అడిగాడు మహేష్.

"నువ్వు కాంటాక్ట్‌లో లేకపోవడం....ట్రై చేసినా నువ్వు రిజెక్ట్ చేయడంతో తట్టుకోలేక పాయిజన్ తీసుకుంది. డాక్టర్లు ట్రై చేసారు. బట్ నో యూజ్. షీ ఈజ్ డెడ్" అన్నాడు డ్రమెటికల్‌గా కిషోర్.

"ఛ! ఈరోజు కూడా ఫోన్ చేసిందిరా. నేనే తీయలేదు. ఛీ ఐయామ్ ఎ కల్చర్‌లెస్ బ్రూట్" అంటూ తల పట్టుకున్నాడు మహేష్.

"సరేలే! అయిపోయినదానికి ఏం చేస్తాంలే!" అన్నాడు కిషోర్ స్వాతి వంక చూస్తూ.

"లేదురా! నాదే తప్పు... నేను నీకు ఎంపీ సీలని ఎక్స్‌ట్రాలు చెప్పాగాని....అసలు కోమలే నా వెంట పడింది. నేను కూడా టెంప్ట్ అయిపోయాను. కాని మదాలస అంటే నాకిష్టంరా. రియల్లీ ఐ లవ్ హర్!" అంటూ ఏడవటం మొదలెట్టాడు మహేష్.

"చనిపోయింది కదా అని సింపతీ చూపించి డైలాగులు కొట్టకు మహేష్. తనుంటే నువ్వు మాట్లాడేవాడివా?... ఇంకో నాలుగురోజులు కోమలితోనే ఎంగేజ్ అయ్యేవాడివిగా. బతికుంటే నువ్వేమైనా పెళ్లి చేసుకునేవాడివా?!" అంది స్వాతి.

"నువ్వు తిట్టడంలో తప్పులేదు స్వాతి. నాదే తప్పు. కాని...మదాలస ఇలా ఎందుకు చేసింది? నా దగ్గరకు వచ్చి నా కాలర్ పట్టుకుని అడగొచ్చుగా. నన్నొక చెంపదెబ్బ కొట్టి నిలదీయొచ్చుగా!" అన్నాడు మహేష్ బాధగా.

వెంటనే మహేష్ చెంప పేలింది.

"అబ్బా!" అనుకుంటూ చూసిన మహేష్ షాక్ అయ్యాడు.

ఎదురుగా మదాలస!

మహేష్ కాలర్ పట్టుకుంది.


"చెప్పరా! నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా? ఎంజాయ్ చేసి వదిలేద్దామనుకున్నావా. చెప్పు" అడిగింది.


మహేష్ బిత్తరపోయి కిషోర్ వంక చూసాడు.

కిషోర్, స్వాతి నవ్వారు.

విషయం అర్థమైంది మహేష్‌కి.

"లేదు డార్లింగ్! నిజంగానే నిన్ను లవ్ చేస్తున్నా. విల్ యూ మ్యారీ మీ?"






అంటూ మోకాళ్ళ మీద కూర్చుని ప్రపోజ్ చేసాడు.

"మేం కూడా మనుషులమేరా! మీరు తిరిగి నట్లే మేమూ బయట తిరగాలనుకుంటాం... కాని మాకు అవకాశం ఉండదు... ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు తిరిగితే సేఫ్టీ ఉంటుందా? ఎవరో ఒకరు తీసుకెళితే బాగుండు అను కుంటాం... ఆ వాక్యూమ్‌లో మీలాంటోళ్ళు ఎంటరైపోతారు... మేం ఫ్లాట్ అయిపోతాం. అది అవకాశంగా వాడుకోవాలని మీరు చూస్తారు... మేము మాత్రం మీరే లైఫ్ అను కుంటాం. వైఫ్ అవాలనుకుంటాం... మీరు మాత్రం..." కోపంగా చూసింది మదాలస.

"ఇంకేం చెప్పకు. మనం పెళ్లి చేసుకుందాం. ప్లీజ్" అడిగాడు మహేష్.

"వాట్ అబౌట్ మీ?!" కోమలి స్వరం కఠి నంగా వినపడింది.

అందరూ అటువైపు తిరిగారు.

కోమలికేం చెప్పాలో ఎవరికీ అర్థం కాలేదు మహేష్‌తో సహా.

వాళ్ళు చెప్పకపోయినా కోమలికి పరిస్థితి అర్థం అయింది. కోపంగా వెళ్లిపోయింది.

"అరేయ్! చతుర్వేదికి చెప్పి నేను కన్విన్స్ చేస్తాలే!" అభయమిచ్చాడు కిషోర్.

మహేష్ రిలాక్స్‌గా ఫీలయ్యాడు.

"ఇంకేంటి మరి... కెఎఫ్‌సీకి వెళదామా.... ఆకలేస్తుంది!" అంది స్వాతి.

"దేవ్వుడా!" అంటూ పదండి అంటూ సైగ చేసాడు కిషోర్.

✦ ✦ ✦

నలుగురూ ఆఫీసుకు చేరుకున్నారు. వెళ్ళగానే ప్రసాద్ కబురు కిషోర్‌కి.

"సార్! పిలిచారంట..." అడిగాడు కిషోర్.

"ఏమయ్యా!... ఇది ఆఫీసు అనుకుంటు న్నారా? బృందావనం గార్డెన్స్ అనుకుంటు న్నారా? ఎవడికి వాడు ప్రేమయుద్ధాలు చేసు కుంటున్నారు. నన్ను చూసి నేర్చుకోండయ్యా. నేను ఆఫీసుకి దూరంగా సాగర్‌కి వెళ్లి మరీ ఎంజాయ్ చేసి వస్తా! ఖర్చయినా తప్పదు కదా!" అన్నాడు ప్రసాద్.

"ఇప్పుడేం జరిగింది?" అడిగాడు కిషోర్.

"నువ్వు, స్వాతి లవ్వంట. స్వాతిని చూసి ఆ చతుర్వేదికి లవ్‌అట. వాడి చెల్లి కోమలితో మహేష్‌గాడు లవ్ అట. ఇప్పుడేమో మహేష్ వాడి ఎక్స్ లవర్‌తో మేరేజట. కోమలి హర్ట్ అట. చతుర్వేదికి హార్ట్ హర్టేనట. ఇద్దరూ లీవ్ పెట్టి ఊరెళ్ళిపోయారు. పదిరోజుల తర్వాత వస్తారంట.... మన ప్రాజెక్ట్ సంగతేంటి?!" సీరియస్‌గా అడిగాడు ప్రసాద్.

"అవునా! నేను ఫోన్ చేసి మాట్లాడతాలే సార్!" అన్నాడు కిషోర్.

కిషోర్ ఫోన్ చేసినా చతుర్వేది ఫోన్ కలవ లేదు.

ఇంతలో ఇద్దరు బలంగా ఉన్న మనుషులు వచ్చారు.


"ఎవర్రా వీళ్ళు పోలీసుల్లా ఉన్నారు?" అడి గాడు కిషోర్.

"లా ఏంటి...వాళ్ళే!" అన్నాడు మహేష్.

వాళ్ళు ప్రసాద్ రూమ్‌లోకి వెళ్లారు.

## లాఫ్ లైన్స

బ్యాంకు క్యాషియర్...
పిసినారి ఇద్దరి దగ్గరా
డబ్బే డబ్బు!
ఒకరు ఖర్చు పెట్టలేరు...
ఇంకొకరు పెట్టరు. అదీ తేడా!



కాసేపటికి హెచ్ఆర్ కూడా ఆ రూమ్‌లోకే వెళ్ళాడు.

పది నిముషాల తర్వాత బయటికి వచ్చారు.

ప్రసాద్, హెచ్ఆర్‌లు టెన్షన్‌గా ఉన్నారు.

కిషోర్‌ని చూపించారు.

"నువ్వేనా కిషోర్ అంటే?" అడిగారు వాళ్ళు.

"ఎస్!" ఏంటన్నట్లు చూసాడు కిషోర్.

"ఈ లాగిన్ నీదేనా?..." ఓ కాగితం చూపిం చారు వాళ్ళు. అది డెన్మార్క్ ప్రాజెక్ట్ క్లయింట్ సర్వర్‌కి సంబంధించిన లాగిన్.

"అవును. అయితే?..." అంటూ చూసాడు కిషోర్.

"మీరు మాతో రండి!" అన్నారు.

"ఎందుకు?" అడిగింది స్వాతి.

"అవును. ఎందుకు?" అడిగాడు మహేష్.

"ఆయనకు తెలుసు. మీరు మూసుకోండి." అని కోపంగా చూసారు వాళ్ళు.

"నువ్వు పద!" అంటూ కిషోర్‌ని లాక్కుపోయారు.

స్వాతి, మహేష్, ప్రసాద్ దగ్గరకు వచ్చారు.

"ఏంటి సార్ ఇది?" కంగారుగా అడిగారు.

"మన కిషోర్ ఏవో టెర్రరిస్టులతో కాన్వర్సేషన్ చేసాడట. వాళ్ళకు ఏజెంట్‌గా చేస్తున్నాడంట. ఏదేదో చెబుతున్నారు... మాకు ఏమీ అర్థం కావడం లేదు." అన్నాడు ప్రసాద్.

✦ ✦ ✦

స్వాతి, మహేష్ స్టేషన్‌కి వచ్చారు.

రాజేష్‌ని కలిసారు.

"సార్ కిషోర్..." అంటూ మొదలెట్టింది స్వాతి.

"చూడండి మీరు కూడా రేపు ఎంక్వయిరీకి రావాలి. మొత్తం మీ ప్రాజెక్ట్‌లో ఎవరున్నారో వారంతా రావాలి... మీరెంత చెప్పినా కిషోర్‌ను వదిలిపెట్టేది లేదు." అన్నాడు రాజేష్.

"కిషోర్‌ని వదిలిపెట్టమని మేం అడగటం లేదు సార్!... అసలేం జరిగింది చెప్పండి!!" అడిగింది స్వాతి.

"హైదరాబాద్‌లో టెర్రరిస్టు కమ్యూనికేషన్స్ మీ ఆఫీసు ద్వారా జరిగాయి... అది కూడా మీరు వాడుతున్న డెన్మార్క్ సర్వర్ ద్వారా అన్ని ట్రాన్సాక్షన్స్ జరిగాయి. జరిగినవన్నీ ఒకే లాగిన్ మీద... అది కూడా కిషోర్ లాగిన్ మీద...

...హైదరాబాద్‌లో ఏదో వాళ్ళు ప్లాన్ చేసారు. ఆ కాన్వర్సేషన్‌లో అదే తెలుస్తుంది. కాని ఏంటనేది తెలియడం లేదు. ఆ ప్లాన్‌కు సంబంధించిన ఫైల్ కూడా పంపినట్లు అందులో మెన్షన్ చేసారు. కాని అదేంటి?... ఆ ఫైలేంటి ఎక్కడుంది... కిషోర్‌ను ఎంత అడిగినా ఏమీ చెప్పటం లేదు." చెప్పాడు రాజేష్.


కాని మా వాడికేమీ తెలియదు సార్." చెప్పబోయాడు మహేష్.

"వద్దు మహేష్! పద మనం వెళదాం... సార్! రేపు వస్తాం సార్" అని చెప్పింది స్వాతి.

బయటికి వచ్చాక –"మహేష్, ఇది సీరియస్ వ్యవహారమే. కిషోర్ లాగిన్ మీద ఎవరో ఆపరేట్ చేసుంటారు. కిషోర్ లాగిన్ ఎవరికి చెప్పుంటాడు?" అడిగింది స్వాతి. మహేష్ కూడా ఆలోచనలో పడ్డాడు.

నలుగురూ ఆఫీసుకు చేరుకున్నారు. వెళ్ళగానే ప్రసాద్ కబురు కిషోర్‌కి. **(సశేషం)**

**అమ్మతోడు**



డాక్టరంకుల్ ఎగ్జామినేషన్స్ అయిపోయాయి అన్నారు... అమ్మ పాసయ్యిందో... లేదో?!




**లాఫ్ లైన్స్**

కాపలా కోసం కుక్కను కొని, దాని గొలుసు ఎవరన్నా కొట్టేస్తారేమోనని వాచ్మెన్‌ను పెట్టాడంట ఎనకటికొకడు.

# హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన

# శ్రీ అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు



హాస్యానందం పత్రిక ఆధ్వర్యంలో, మా తండ్రిగారి పేరిట నిర్వహించిన వ్యంగ్య చిత్రాల పోటీలో పాల్గొన్న ఔత్సాహికులు అందరికీ నా అభినందనలు.


అలాగే ఈ పోటీని విజయవంతంగా నిర్వహించిన సంపాదకులు శ్రీ రాముగారికి నా కృతజ్ఞతలు.

ఈ పోటీకి గాను దాదాపు 159 చిత్రాలు ఎంట్రీలుగా వచ్చాయి. ఇందులో పేరెన్నిక గల కార్టూనిస్టులతో పాటు ఇప్పుడిప్పుడే బుడి బుడి అడుగులు వేస్తున్న నవయువ, బాల చిత్రకారులు కూడా తమ ఆలోచనలకు పదును పెట్టి మంచి కార్టూన్లను అందించారు. సమకాలీన అంశాలతో పాటు సామాజిక ఇతివృత్తాలను కూడా స్పృశించారు. తమ కుంచెకు పదును పెట్టారు. తమ భావాలను పంచుకున్నారు. అయినప్పటికీ ఇది పోటీ కాబట్టి, న్యాయనిర్ణేతలు ఈ చిత్రాలలోని వివిధ కోణాలను పరిశీలించి విజేతలను ప్రకటించారు.


ఈ పోటీ కోసం సమయం వెచ్చించిన ప్రతీఒక్క కార్టూనిస్టుకు పేరు పేరునా మా ధన్యవాదాలు మరియు శుభాభినందనలు.

–మీ మిత్రుడు, **ఎ. జయకుమార్**


**ప్రథమ బహుమతి రూ.1000/-పొందిన కార్టూను**






**ద్వితీయ బహుమతి రూ.800/-పొందిన కార్టూను**






**ప్రత్యేక బహుమతులు రూ.300/-పొందిన కార్టూన్లు (10)**










మీ అమ్మగారి ఆరోగ్యం బాగానే ఉందని మన రెలెటివ్స్ వాట్సాప్
గ్రూప్‌లో మెసేజ్ పెట్టేయండి. ఆవిడ్ని చూడ్డానికి వచ్చే వాళ్లకి
కాఫీ టీలందించలేక.. మళ్ళీ నేను ఛస్తున్నాను!...
SARMA


నేను నీకు 2 లక్షల అప్పు ఉన్నంత మాత్రాన బలవంతంగా తేసుకువచ్చి ఇలా దగ్గరుండి నాకు కరోనా టీకా ఇప్పించడం ఏమన్నా బాగుందా?
COVID VACCINATION CENTRE
బండి రవీందర్...


KRISHNA MURTY IAS
DIST COLLECTOR


పప్పు ర్యాంక్ కోసం కష్టపడి చదివాడు.. పరీక్షలు రద్దయి కరోనా బ్యాచ్‌గా మారిపోయాడు
పరీక్షలు రద్దు...
రఘు..


నీకూ, నాకూ గొడవలుంటే మనిద్దరం చూసుకోవాలికానీ-వెళ్లి నీ పెళ్లాన్ని తీసుకొచ్చి ఉసిగొలిపావేంట్రాబాబూ...


నేను నా అత్తారింటికి వెళ్తున్నా అల్లుడూ...ఓ నెల రోజులు ఉండి వస్తాం!
ఒక గంట ముందుగా బయలు దేరాల్సింది...నా ఖర్మ తప్పించుకున్నావ్ మామ!
M.A.రవూఫ్




నువ్వు నాకు కావాలి...!
నీ ఫ్యామిలీకి నువ్వు కావాలి... ఆలోచించుకో..!
WINE
అయ్యప్ప



# నారికేళి

'భారద్వాజ'- 99676444548

**ఆదివారం ఆలస్యంగా నిద్రలేద్దాం అనుకున్న నాకు ఉదయం నాలుగున్నరకే పెద్ద శబ్దంతో మెలకువ వచ్చింది.**

**గదిలోంచి హాలులోకి వెళ్ళి చూస్తే నా సతీమణి దేముడికి కొబ్బరికాయ పాలరాతి మీద రాక్షసంగా కొడుతోంది. నాకు కంగారు రెట్టింపయింది. ఆరా తీస్తే కాయ కొట్టే గుండ్రాయి కనిపించలేదని సంజాయిషీ ఇచ్చుకుంది.**

అది కాదే ఇప్పుడు కొబ్బరికాయ ఎందుకు కొడుతున్నట్లు అంటే ఆవిడ చెప్పిన జవాబుకు నాకు పూర్తి మెలకువ వచ్చేసింది.

అసలు విషయానికొస్తే నాకు సంతానం నలుగురు. మొదటి సంతానం ఆడపిల్ల పుడితే దేముడికి కొబ్బరికాయ కొడతానని మొక్కుకుంది. అప్పటినుండి మా ఇంట్లో ఏ చిన్న సంఘటన జరిగినా దేముని ముందు కొబ్బరి కాయ పగలాల్సిందే!

ఒక ఇవాళ్టి విషయానికొస్తే "నిన్న చల్ల మిరపకాయలు ఎండలో పెట్టానండి ఎండ బాగా కాస్తే కాయ కొడతానని మొక్కుకున్నానండి. అదే ఇది!" అంది.

ఈవిడకి కాయ కొట్టడానికి కారణం బలంగా ఉండక్కర్లేదు.

అంతకుముందు మేము ఉండే ఇంటి దగ్గర కొబ్బరికాయలమ్మే అతను ఈవిడ కాయలు కొన్నందువల్ల ఇల్లు కట్టుకున్నాడు. ఇద్దరు పిల్లల్ని అమెరికాలో చదివిస్తున్నాడు.

తరచూ కొబ్బరికాయ కొట్టడం అనే (వ్యాధి) మేనియా ఏదో ఈవిడకి ఉన్నట్టుంది.

కొబ్బరికాయలు అమ్మేవాడి దగ్గర ఎప్పుడూ కాయలు ఉండేట్టు చూడు స్వామి అని ఒక కాయ, కాయ సరిగ్గా సగానికి పగలాలని ఒక కాయ, ఇలా చెప్పుకుంటూ పోతే ఈవిడ కోరికలు కొబ్బరిచెట్టు వేళ్ళంత పొడుగుంటుంది.

నేను ఎక్కడో చదివాను కొబ్బరిచెట్టు వేళ్ళు 150 కి.మీ వరకూ వెళ్ళగలదని.

మా పెద్దమ్మాయి పుట్టినప్పట్నుంచి నాల్గవ సంతానానికి పిల్లలు పుట్టేవరకూ కొడుతూనే ఉంది.

పిల్లలు ఉన్నత విద్యలు పూర్తి చేసుకుని పెళ్ళిళ్ళు చేసుకుని ఉద్యోగాలలో స్థిరపడి పిల్లల్ని కని హాయిగా ఉన్నారు.... అయినా ఈవిడ కాయలు కొడుతూనే ఉంది.

మా పెద్ద మనవరాలు అమెరికాలో ఈత నేర్చుకొందుకు మొదటిరోజు కొలనులో దిగినప్పుడు బాగా ఈత రావాలని ఇక్కడ ఈవిడ కాయ కొట్టింది.

ఈవిడ చాదస్తం నమ్మకం ఎంతంటే తాను కాయ కొట్టడం వల్లే నాటి ఎన్‌టిఆర్ దగ్గర నుండి నేటి జగన్ వరకూ ముఖ్యమంత్రులయ్యారని కొబ్బరికాయ కొట్టి మరీ చెబుతుంది.

ఇంతవరకూ ఎలాగో భరించాను.

పిచ్చిమొద్దు చీరలు అడగదు... నగలు ఆశించదు పోనీలే పాపం ఒక్క కొబ్బరికాయ పిచ్చి తప్ప నన్ను ఇంకే విధంగానూ ఇబ్బంది పెట్టదు సర్దుకుపోదాం అనుకుంటే అంతటితో ఆపలేదు.

దేముడికి కొట్టిన కాయలో ఒక చిప్ప పచ్చడికి ఒక చిప్ప ఆవుకి పెడుతుంది.

కొబ్బరిని ఉపయోగించి ఈవిడ ఎన్ని రకాల వంటలు చెయ్యగలదు అంటే కోనసీమ వాళ్ళు, కేరళ వాళ్ళూ కూడా అన్ని చెయ్యలేరు!


రోజూ కొబ్బరికాయ తింటే పైత్యం అంటే మీకు పైత్యం రాకూడదు అని ఆ దేముడికి కాయ కొట్టి మొక్కుకుంటాను కాయ పట్రండి అంటుంది.



తెలుగోడి లాజిక్ :

అమ్మాయిని కొడితే- "ఆడదాన్ని కొడుతున్నాడు... ఛీ! వీడేం మగాడు."

ఒకవేళ అమ్మాయి చేతిలో దెబ్బలు తింటే, "ఆడదాని చేతిలో దెబ్బలు తింటున్నాడు... ఛీ! వీడేం మగాడు."



ఈ విషయంలో ఈవిడతో వాదించడం, ఈ అలవాటు మాన్పించటం మన దేశంలో అవినీతిని అంతమొందించటమంత కష్టం.

అంతటితో అయిపోలేదు.

కరోనా కాలం కదా కాయ దొరకడం కష్టం కదా అన్నాను.

మీరేం దిగులు పడకండి. ఇంటి దగ్గర ఉండే కొబ్బరి అబ్బి వాళ్ల అబ్బాయి చేత 50 కాయలు ముందు జాగ్రత్తగా నిన్ననే ఇన్నో వాలో పంపించాడు... డబ్బుల్దేముందండి అంటూ! ఇప్పట్లో ఏ ఢోకా లేదు అంటూ! ఈ అలవాటు నేను ఎలాగూ మాన్పించలేను అను కుంటుంటే నాకు ఒక ఉపాయం తోచింది.

"ఏమేవ్! నువ్వు ప్రతీ చిన్న, పెద్ద విషయా నికి కాయ కొడుతున్నావు కదా. కరోనా ఖతం కావాలని కోరుకుని కాయ కొట్టొచ్చు కదే!" అన్నాను నా తెలివికి నేనే మురిసిపోయా. దానికి ఆవిడ–

"ఎందుకు కోరుకోలేదండి? నేను కాయ కొట్టి కోరుకోబట్టే కదా! దేముడు నా మొర విని ఆనందయ్యను ఆయుర్వేద మందు చెయ్య మన్నది!"

నేను నోరు వెళ్ళబెట్టి అలాగే ఉండి పోయాను.





పిల్లల కోసం సరికొత్త

# విచిత్ర విందు

**పుట్టగుంట సురేష్ కుమార్**

**వెచ్చని సూర్యకిరణాలు ముఖంపై పడి గిలిగింతలు పెడుతుంటే... మెల్లగా కళ్ళు తెరిచింది కోతి.**

**చుట్టుపక్కల నుంచి పక్షుల కిలకిలా రావాలు ఎంతో శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. కోతి తన్మయంగా వాటిని వింటూ 'కిచ కిచ....కిచ కిచ' మంటూ ఓ పాట అందుకుంది. అలా పాడుకుంటూ తన నివాసమైన మర్రిచెట్టు పైనుంచి కిందకు తొంగి చూసింది.**

**అక్కడ ఒక లేడి మంచి నిద్రలో వుంది.**

దాన్ని చూడగానే కోతిలో ఉత్సాహం ఉరక లేసింది.

'వావ్! ఆడుకోవడానికి ఓ నేస్తం దొరికింది.' అనుకుని చెట్టుపైనుంచి టక్కున కిందకు దూకింది.

"లేడి మిత్రమా! లే...లే!!" అంటూ దాన్ని లేపింది.

లేడి ఉలిక్కిపడి లేచింది.

కోతి ఇకిలిస్తూ– "మిత్రమా! శుభోదయం!!" అంది.

"ఆఁ! శుభోదయం!" అంది లేడి ఆవులిస్తూ.

కోతి ఉత్సాహంగా ఊగుతూ–

"లేడి మిత్రమా!... ఏం చేద్దాం?... కాసేపు ఆడుకుందామా?" అని అడిగింది.

"ఆటా? ఇప్పుడా?" చిరాగ్గా అడిగింది లేడి.

"అవును. ఇప్పుడే! అయినా మన అడవిలో ఆటపాటలకు వేళపాళలు ఉంటాయా చెప్పు!" అంది కోతి కిసుక్కున నవ్వుతూ.

లేడి చటుక్కున లేచి నిలబడి– "సరే... పరిగెడదాం పద! పరిగెత్తడం అనే ఆటలో ఎంత మజా ఉంటుందో!" అంటూ అది చకచకా పరుగులు తీస్తూ క్షణంలో మాయమైపోయింది.

ఊహించని పరిణామానికి బిత్తరపోయిన కోతి– 'ఈ లేడికి లేచిందే పరుగు' అనుకుని ముందుకు నడవసాగింది.

కొద్ది దూరం పోయాక దానికి ఓ గున్న ఏనుగు ఎదురొచ్చింది.

"గున్నన్నా!... బాగున్నావా?" అంటూ ప్రేమగా పలకరించింది కోతి.

"నాకేం! భేషుగ్గా ఉన్నా!" చెప్పింది గున్న ఏనుగు.

కోతి దాని పక్కనే నడుస్తూ– "గున్నన్నా! నాకేం తోచటంలేదు. కాసేపు ఆడుకుందాం. నీకు ఏ ఆటంటే ఇష్టమో చెప్పు?" అంది.


"జలకాలాట ఇష్టం!..." చెప్పింది గున్న ఏనుగు.

కోతి తెల్లబోయి చూస్తూ– "జలకాలాటా? అదేం ఆట?" అంది.

గున్న ఏనుగు నవ్వి– "జలకాలాట అంటే

## లాఫ్ లైన్స్

**తెలివి అనేది**
**అండర్వేర్ లాంటిది.**
**అది ధరించడం ముఖ్యం**
**కానీ...**
**ప్రదర్శించడం కాదు.**



నీటిలో దిగి స్నానం చేయడం." అని చెప్పింది.

"స్నానం చేయడం కూడా ఓ ఆటేనా?..." అంటూ కోతి పగలబడి నవ్వసాగింది.

గున్న ఏనుగు గుర్రుమని చూస్తూ–

"అవును ఆటే! నేనిప్పుడు మన అడవిలోని కొలనులో జలకాలాట ఆడటానికి వెళుతున్నా! నువ్వూ నాతో రా!!... ఇద్దరం కలసి ఆడు కుందాం!" అంది.

కోతి భయంతో వెనక్కు గెంతి–

"బాబోయ్! కొలనులోకి దిగడం నాకెంతో భయం. నేను రానులే." అంది.

గున్నఏనుగు దానివంక హేళనగా చూస్తూ

"అయ్యో! రాలేవా? అయితే ముసలమ్మలా ఓ మూల కూర్చో! నే వెళతా!" అని ఠీవిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది.

కోతి హాయిగా ఊపిరి పీల్చుకుని...

"గున్నఏనుగు వెళ్లిపోతే నాకేం!... మరో మంచి నేస్తం దొరక్కపోదు." అనుకుంది.

అంతలో ఒక ఎలుగుబంటి అటుగా వచ్చింది.

కోతి మెరిసే కళ్ళతో–

"ఎలుగుబంటి మామా! కుశలమా?" అని ఆప్యాయంగా పలకరించింది.

ఎలుగుబంటి కోతికేసి కొరకొరా చూసి... తన దారిన తాను వెళ్లిపోయింది.

ఉస్సూరు మంటూ కూర్చుని... 'ఏమిటో! ఈ అడవిలోని జంతువులు నన్నసలు ఖాతరు చేయవు! ఇవెప్పుడు మారతాయో! నన్నెప్పుడు గౌరవిస్తాయో!' అనుకుంది.

కాసేపు అలాగే కూర్చుని ఉన్నట్టుండి లేచి నిలబడింది కోతి.

'ఎవరూ నాతో ఆడకపోతే నాకు నష్టమే మిటంట!... నేనొక్కదాన్నే ఎంచక్కా ఆడు కుంటా!' అనుకుంది.

తరువాత 'కిచకిచ' మని పాడుకుంటూ హుషారుగా గెంతులేయసాగింది.

అదే సమయంలో గాల్లో ఎగురుతున్న ఒక రామచిలుక కోతిని చూసింది.


"భలే భలే కోతి! భళా భళా కోతి!... పాటలు పాడే కోతి!... ఆటలు ఆడే కోతి!..." అంటూ ప్రశంసల జల్లు కురిపించింది.

కోతి మురిసిపోతూ–

"చిలకమ్మా! నా ఆటపాటలు నిజంగానే బాగున్నాయా?" అని అడిగింది.

"అవును కోతిమిత్రమా!" నీ ఆటపాటలు చాలా చాలా బాగున్నాయి. అసలు నీ చలాకీ తనం చూస్తుంటే...నాకు తెగ ముచ్చటేస్తోంది." అంది రామచిలుక.

"చిలకమ్మా! నీ పలుకులు ఎంత తియ్యగా ఉన్నాయో! వింటుంటే....ఇంకా ఇంకా వినా లనిపిస్తోంది. తెలుసా?!" అంది కోతి దాని



వంక పరవశంగా చూస్తూ.

రామచిలుక నవ్వి...

"నా పలుకుల సంగతి పక్కన పెట్టి నీ ఆటల సంగతి చెప్పు. అసలు నువ్వెందుకు ఒంటరిగా ఆడుకుంటున్నావ్? నేస్తాలతో కలిసి ఆడుకో వచ్చుగా!" అని అడిగింది.

కోతి విచారంగా ముఖం పెట్టి...

"చిలకమ్మా! ఏం చెప్పమంటావులే... నా నేస్తాల గురించి! ఈ అడవిలోని జంతువులు కలిసిమెలసి ఉండవు... దేని దారి దానిదే! ఆడుకుందాం రమ్మంటే ఒక్క జంతువూ ముందుకు రాదు... అసలు, జంతువులన్నీ నన్నెందుకో చులకనగా చూస్తాయి." అని తన వెతలు ఏకరువు పెట్టుకుంది.

ఆ మాటలు విన్న రామచిలుక నిట్టూరుస్తూ– "కోతిమిత్రమా! బాధపడకు!... నీకూ మంచి రోజులు వస్తాయిలే! నీ జీవితం ఓ వింత మలుపు తిరుగుతుందిలే..." అని చెప్పింది.

"ఏమిటీ? నా జీవితం ఓ వింత మలుపు తిరుగుతుందా? భలే! భలే! చిలకమ్మా, నీకు జోస్యం చెప్పడం తెలుసా?" ఎంతో ఆశ్చర్యంగా అడిగింది కోతి.

రామచిలుక తల అడ్డంగా ఊపుతూ–

"కోతి మిత్రమా! నేను చెప్పింది జోస్యం కాదు. ఏదో నా మనసుకు తోచింది చెప్పానంతే!... సరేలే గానీ, నాకు ఆకలి తెగ దంచేస్తోంది. వెంటనే ఓ తియ్యని పండును తినాలి. ఇక సెలవా మరి!..." అంటూ అది తుర్రుమంది.

'ఆహా! ఈ చిలకమ్మ ఎంత మంచిదో! ఎంత చక్కగా మాట్లాడుతుందో!... దీని పలుకులు వింటుంటే, ఎంత చక్కని కాలక్షేపమో!...' అనుకుంది కోతి.

తరువాత కోతికి ఏం చేయాలో తెలియక, ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టు మీదకు దూకసాగింది.

అలా దూకుతూ, తనకు తెలియకుండానే ఓ కొత్త ప్రదేశానికి చేరుకుంది.

'వావ్!... ఆ చిలుక జోస్యం ప్రకారం నా జీవితం వింత మలుపు తిరిగినట్టుంది... ఏదో వింత ప్రదేశానికి వచ్చి పడ్డా!' అనుకుని చుట్టు పక్కల పరిశీలిస్తూ ఉలిక్కిపడింది. **(సశేషం)**




పిల్లలూ... ఈ కింది వాక్యంలోని తారుమారైనా పదాలను సరి చేస్తే, రెండు వాక్యాలు వస్తాయి... ఒకటి జనరల్ నాలెడ్జికి సంబంధించిన వాక్యం, రెండవది సూక్తి! ఇక మీ మెదడుకి పదును పెట్టి, ఆ రెండు వాక్యాలను కనిపెట్టండి!


**క్లూ:** 1వ వాక్యం 5 పదాలు ✦ 2వ వాక్యం 6 పదాలు

వెన్నెముకలోని | జీవితంలో | మొదటి | సుగుణం | ఎముకని | గొప్ప

మనసును | అట్లాస్ | ఉంచుకోవటం | ఏకాగ్రతగా | అంటారు

**సమాధానం:** 1.వెన్నెముకలోని మొదటి ఎముకని అట్లాస్ అంటారు. 2.జీవితంలో గొప్ప సుగుణం మనసును ఏకాగ్రతగా ఉంచుకోవటం


**క్రియేటివ్ రైటర్, ఫిలాసఫర్& సైకాలజిస్ట్ శ్రీ పుట్టగుంట సురేష్ కుమార్ పిల్లల కోసం రచించిన పుస్తకాలు**




పై పుస్తకాలు లభించు చోటు

**నవరత్న బుక్‌హౌస్, రహిమన్ స్ట్రీట్, అరండల్ పేట, విజయవాడ-2**
**ఫోన్: 0866-2432813, 9848082432**

# తర్కారావు కథలు




గంగాధర్ వడ్లమన్నాటి-9908445969

## శిక్ష మారింది

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

**త**ర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని- "చోరన్‌కి చిన్నప్పటి నుండీ లాంగ్‌జంప్ అంటే చాలా ఇష్టం. అతనికి అందులో, నేషనల్ లెవెల్లో పథకాలు కూడావచ్చాయి... అతను చిన్నప్పటి నుండీ చేతిలో నిచ్చెన పట్టుకుని ఆకాశం వైపు చూస్తూ ఉండేవాడు.



అది గమనించిన వాళ్ళ నాన్న, ఆకాశానికి నిచ్చెన వేయలేం అని చెప్పడంతో చాలా నిరాశ పడతాడు చోరన్.

పెద్దయ్యాక, తండ్రి మాట మీద అతను ఆ దేశ సైన్యంలో సైనికుడిగా చేరతాడు.

ఎలాగోలా బలవంతంగా సైన్యంలో పని చేస్తున్న చోరన్‌కి, ఉన్నట్టుండి ఓ చచ్చు ఆలోచన వచ్చింది. అది వచ్చీ రాగానే అతనిలో పైత్యం పెచ్చు పెరిగింది... దాంతో అతను అత్యాశతో రెచ్చిపోయి, నమ్మకం అనే పదాన్ని వమ్ము చేస్తూ, తన దేశ సైనిక సమాచారాన్ని పప్పు బెల్లంలా శతృదేశాలకి అమ్ముకున్నాడు.

ఆ తర్వాత పరారైపోయాడు.

ఇది తెలిసిన ఆ దేశ నిఘా వ్యవస్థ, గల్లీ గల్లీ గాలించింది. చివరికి ఓ జిల్లాలో, ఊరి చివర ఉన్న విల్లాలో, విశాలమైన మంచంమీద పడుకుని, కులాసాగా కాళ్ళూపుతూ కబుర్లు చెబుతున్నతన్ని పట్టుకుంది. ఆనక అతన్ని నిలేసింది.

ఆ తర్వాత అతని చెవి మెలేసి మరీ అరెస్ట్ చేసింది. తరువాత విచారణ చేసి, కేసుకి కావాల్సిన సాక్ష్యాలు సేకరించి, అతన్ని కోర్టులో ప్రవేశ పెట్టింది.

నేరం నిరూపణ కావడంతో, కారం తిన్న మనిషిలా మండిపోయిన జడ్జిగారు, అతనికి ఉరిశిక్ష ఖరారు చేసారు.

తర్వాత అక్కడి నుండి నడిచి వెళ్ళబోతున్న జడ్జిగారి కాళ్ళపై పడిన చోరన్, వెక్కివెక్కి ఏడుస్తూ ,తనకి ఉరిశిక్ష అంటే భయం అని నొక్కి నొక్కి మరీ చెబుతాడు.

అంతగా కాకపోతే మత్తిచ్చి ఉరి తీయమని జడ్జిగారి కోటు, బూటు పట్టుకుని బ్రతిమాలతాడు.

అయితే అతనిపై జాలిపడిన జడ్జిగారు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో , ఇది వరకు కొందరు ఖైదీలకి ఇచ్చిన అవకాశమే ఇతనికీ ఇచ్చారు. అంటే, అతను ఎలా చనిపోవాలనుకుంటున్నాడో, అతనే నిర్ణయించుకోవచ్చు అని చెబుతారు.

అపుడు చోరన్, తను ఎలా చనిపోవాలనుకుంటున్నాడో జడ్జిగారికి చెబుతాడు.

జడ్జిగారు ఆలోచనలో పడి, ఇక చేసేది లేక సరే అంటారు.

అలా అతను కోరుకున్న విధంగానే అతని మరణశిక్ష అమలు జరిగింది... కానీ యాభై ఏళ్ళ తర్వాత!

ఇప్పుడు చెప్పు! అతను ఎలా చనిపోవాలని కోరుకుని ఉంటాడు. అతని మరణశిక్ష అమలు కావడానికి యాభై ఏళ్ళ సమయం ఎందుకు పట్టింది?" అడిగాడు తర్కారావ్.

సుబ్బారావు ఆలోచించి తల గోక్కున్నాడు. మళ్ళీ ఆలోచించి ముక్కు గోక్కున్నాడు...ఇక మళ్ళీ ఆలోచించినా ప్రయోజనం లేదని తెల్ల మొహం వేసాడు.

"సరే! నువ్వు చెప్పలేక తెల్ల మొహం వేసావ్ కాబట్టి, నేనే చెబుతాను విను. అతను వృద్ధాప్యంతో చనిపోయే అవకాశం ఇమ్మని కోరుకుంటాడు. దాంతో అతన్ని చనిపోయే వరకూ జైల్లో పెడతారు. అలా అతను జైల్లో యాభై ఏళ్ళు బతికిన తర్వాత చనిపోయాడు. అదీ అసలు సంగతి... నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్ధం చేసుకోరు కదా!..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

# కొత్తిమీర కట్ట

ఆర్.సి.కృష్ణ స్వామి రాజు, 9393662821

**చిత్తూరు జిల్లా పుత్తూరు రాసపల్లి. ఊర్లో గంగ జాతర జరగతా వుంది.**

**వాన వచ్చి నిలిచి ఎండ వస్తావున్నవేళ– “ఒరేయ్ కిష్టా!... కాలేజీ నుంచి వచ్చిందే ఊరంతా అల్లి బిల్లి తిరగతా ఉండావు. నడుము నొప్పులుకి మీ అమ్మ కూర్చొంటే లేవలేదు... లేస్తే కూర్చోలేదు. ఇంటి పనుల్లో, వంటపనుల్లో అమ్మకి ఇంగవంత సాయం చేయకూడదారా! ఎద్దు మాదిరి తినేసి వీధులన్నీ తిరగతా వుండావే!” అని మేనమామ మునివేలు ముక్కు పొడివేసుకొంటూ కిష్టడికి క్లాసు పీకినాడు.**

‘మేనమామని అమ్మ దేవుడమ్మ దేవుడు అని వూరేగించే మనిషి కదా! మేనమామ మాట బంగారు మూట కదా! ఇప్పటికిప్పుడు ఏమి చేసేదబ్బా? అమ్మకి సాయం ఎట్లజేసేదబ్బా?’ అని తల గోక్కొంటూ కిష్టడు తన క్లాసుమేటు బాలాజిగాడిని కలద్దామని ఊర్లోకి బయలు దేరినాడు.

వేణన్నకొడుకు బాలాజిగాడు రచ్చబండ కాడ ఆడపిలకాయలతో దాయాలాట ఆడతా ఉంటే, దూరంగా సరోజక్క ఇంటకాడి కానుగ చెట్టు కిందికి పోయి నిలబడినాడు. బాలాజి గాడు దాయాలాట ఆడేది నిలిపేసి కానుగ చెట్టుకాడికొచ్చి–“ఏమైయిందిరా! ఏదో మాదిరి ఉండావు” అని అడిగినాడు.

కిష్టడు వాళ్ళ మేనమామ చెప్పింది సినిమా రీలు మాదిరి తిప్పితిప్పి చెప్పి బాలాజిగాడి సలహా అడిగినాడు.

“మిత్రమా! లేక లేక నన్ను, సలహా అడిగి నావు... మన ఫ్రెండ్ షిప్పు, కూరలో వేసి, పడేసే కరివేపాకు ఫ్రెండ్‌షిప్పు కాదు మిత్రమా, మనది కూరలో వేసి, కూరతో కూడా తినే కొత్తిమీర ఫ్రెండ్‌షిప్పు మిత్రమా!” అంటూ ఏదో గుర్తుకొచ్చినోడు మాదిరి–

“కిష్టా! కొత్తిమీర అంటే గుర్తుకొచ్చింది, మీ పెళ్ళో (పెరట్లో)ధనియాలు చల్లు. అవి వారం, పదిరోజులకి కొత్తిమీర అవతారం ఎత్తుతాయి. వంటల్లోకి కొత్తిమీర ఇస్తే మీ అమ్మ ఖుషీ అయి పోతందిరా! మీ మేనమామ దగ్గర మార్కులు కొట్టేయొచ్చు!!” అని ఉచిత సలహా ఒకటి ఇచ్చినాడు.

కిష్టడు లెఫ్ట్ రైట్ కొట్టుకొంటూ... కాటన్ ప్యాంటు ఎగేసుకొంటూ... అక్కినేని లెక్కన స్టయిల్ స్టయిల్ గా నడుచుకొంటూ ఇంటికెళ్లి నాడు. గాది పక్కనున్న మట్టికుండలోని ధని యాలు పిడికిటి నిండా ఎత్తుకొని కులకతా పెళ్ళో చిక్కుడు చెట్టు పక్కన చల్లినాడు.


ఆ రోజు నుంచీ కాలేజీ నుంచి వచ్చిందే, పుస్తకాలు తిన్నె మీద పడేసి పెళ్ళోకెళ్లి తాను చల్లిన ధనియాల కాడ కూర్చొని ‘కొత్తిమీర పుట్టిందా లేదా’ అని తొంగి తొంగి చూసి నాడు. రెండవ రోజున కొన్ని నీళ్లు చల్లినాడు. నాల్గవ రోజున తాటితోపు కాడి దిబ్బలోని ఎండు పేడ ఎరువుగా తెచ్చి చల్లినాడు. ఆరవ రోజు దేవుడ్ని తలుచుకొంటూ...

“మొలకా!... ఓ మొలకా... మొలకెత్తవే మొలకా!” అంటూ రాగాలు తీసి పాడినాడు.

ఎనిమిదవ రోజు కిష్టడికి ఒక డౌటు వచ్చింది. మొలకెత్తాలని ధనియాలకు మనసు లో వున్నా, సరైన గాలి దొరకక వాటికి ఊపిరి ఆడక మొలకెత్తడం లేదేమోననిపించింది. వెంటనే టెంకాయ పొరక్కట్టలో వుండే పొరక పుల్ల ఒకటి పెరుక్కొని ధనియాలు చల్లిన నేలలో, అక్కడక్కడా గుచ్చి గుచ్చి నీళ్లు పోసి నాడు. పదవ రోజున చూస్తే, గుంపుగా ఊర పిచ్చుకలు కొన్ని చిక్కుడు చెట్టు పైన కూర్చొని ఉండాయి. ధనియాల్ని పిచ్చుకలు ఏమైనా తినేసి పోతున్నాయేమోనని గులకరాళ్లు రెండు పిచ్చుకలపై విసిరి, అవి దూరంగా పొయ్యేంత వరకు తరిమి తరిమి కొట్టినాడు.

## లాఫ్ లైన్స్

ఆధునిక డైజెషన్ ప్రాబ్లం:
గొప్పోళ్ళు మనకు తెలియాలి అనుకుంటాం... మనకు తెలిసినోళ్ళు గొప్పోళ్ళూ అయిపోతే మాత్రం జీర్ణించుకోలేం!



'పిడికెడు ధనియాలు చల్లినా పైసా ఆదాయం లేకుండా పోయింది కదబ్బా' అని రోగం తగిలిన కోడి మాదిరి రెండు రోజులు మెడ వాల్చి, ఊర్లోని గ్రామ దేవతలైన గంగమ్మ, అంకాలమ్మ, అంజేరమ్మ, ఆరేటమ్మ, కనికలమ్మలకు దండాలు పెట్టినాడు. ఇంక లాభం లేదనుకొని ఉండబట్టలేక ఒక ఆదివారం రోజు చిన్న కమ్మి ఎత్తుకొని ధనియాలు చల్లిన చోట తవ్వతా కూర్చొన్నాడు. చల్లిన ధనియాలు ఏమైనాయోనని వెదకతా వున్నాడు.

దోవన బోతా కిష్టడి మేనత్త సిద్దమ్మ అలియాస్ సుధక్క– "ఒరేయ్ కిష్టా! తెల్లారే కడికి తవ్వతా ఉండావేందిరా?" అని ముక్కుపుల్లని ముక్కుకి చెక్కుకొంటా అడిగింది.

కక్కలేక మింగలేక విషయం వివరంగా చెప్పినాడు.

మేనత్త మోకాళ్ళ మీద చేతులు పెట్టుకొని మరీ పడీ పడీ నవ్వింది.

"తిక్కలోడు తిరుపతికి పోతే ఎక్కా, దిగా ఏడేండ్లు పట్టిందంట. ఆ మాదిరి నువ్వు కొత్తిమీర కోసం ధనియాలు చల్లినావు, సంతోషం కానీ.. అట్ట ధనియాలు చల్లితే మొలకలు రావురా కిష్టా! ధనియాలను చేత్తోనో కాలితోనో బాగా నలిపి చల్లితే అప్పుడు వస్తుందిరా కొత్తిమీర కట్ట!" అని చెప్పింది.

అప్పుడు వాడికి వాళ్ళ నాయనమ్మ చెప్పిన 'ధనియాల జాతి మెట్టుతో చరిస్తే గానీ దారికి రాదు' సామెత ట్యూబులైటు మాదిరి మెదడులో మెరిసింది.



మేనత్త క్లాసు పీకినందుకు కాదు, అప్పుడనంగనే, వాడి మరదలు మీనాక్షి వాడిని చూసి నవ్వతా పోయింది. అందుకు వాడికి పేడ కొట్టినట్లయ్యింది.

'ఇంటర్ చదివే నన్ను మరదలు మీనాక్షి ముందర గాలి పెరికేసింది కదబ్బా అత్త' అని అనుకొని కాసేపు బుంగ మూతి పెట్టి అక్కడే కాసేపు నిలబడినాడు.

'పడినా పల్టీ' అనుకొనే వాడు కదా కిష్టడు, రోషంగా వెళ్లి కుండలోని ధనియాలు తెచ్చి బాగా నలిపి 'పోయిన చోటనే వెతుక్కోవాలి' సామెత గుర్తు పెట్టుకొని... దింపుడు కళ్లెం ఆశతో, చల్లిన చోటనే మళ్ళీ చల్లినాడు.

'ఈ ధనియాలకు మా ఇంట్లో కొత్తిమీరగా పుట్టే రాత రాసి పెట్టి ఉంటే పుడ్తాయిలే' అనుకొని గబగబా చల్లేసి రెండు వారాలు ఆ పక్క దిక్కుమొక్కు చూడలా.

✦ ✦ ✦


ఒక సెకండ్ సాటర్ డే నాడు పుత్తూరు శ్రీనివాసా థియేటర్లో అడవి రాముడు సినిమా సెకండ్ షోకి పోయివచ్చి పడుకున్నాడు. ఊర్లో కోళ్లు కూసిన గంటకి, కప్పుకున్న దుప్పటి పైన ఎలుక ఒకటి తిరుగులాడుతుంటే గబుక్కున లేచి కూర్చొన్నాడు.

ఎలుక సర్రుమని గాది కాడి చిన్న సందులో దూరి వెళ్ళిపోయింది.

కిష్టడు సందు కాడే కాసేపు కూర్చొని 'ఇంత చిన్న సందులో అంత పెద్ద ఎలుక ఎట్ల దూరిందబ్బా' అని... కాసేపు ఆలోచించి...

'గూనోడు పడుకొనే వాటం గూనోడికే తెలుస్తుంది కదా' అని గుర్తుకొచ్చి పుసికండ్లు నలుపుకొంటూ పెళ్ళోకి పోయి తొంగి చూసినాడు.

కొత్తిమీర మొలకలు ముద్దు ముద్దుగా మెరుస్తూ కనిపించాయి.




వాటిని చూసి ఆనందంతో తిక్కర బిక్కర పడినాడు. కాసేపు తైతక్కలాడినాడు.

పరిగెత్తతా నీళ్ల తొట్టె కాడికి పోయి నీళ్లతో నోరు పుక్కిలించినాడు. లైఫ్ బాయ్ సోపుతో ఒకసారి, నడిపక్క, రెండవ అక్క గూట్లో దాచి పెట్టిన మైసూరు శ్యాండిల్ సోపుతో ఒకసారి మొఖాన్ని రెండుసార్లు కడిగినాడు.

ఊరకే కడగలా... ప్రేమనగర్ సినిమా పాట "నేను పుట్టాను, లోకం మెచ్చింది" పాడతా కడిగినాడు. పుల్లంపేట టర్కీ టవల్ తో ముఖం తుడుచుకున్నాడు.

వయ్యారంగా డ్యాన్సుచేస్తూ... 'ఛాంగురే బంగారు రాజా' అనే సినిమా పాట పాడుకొంటూ రజినీకాంత్ స్టయిలు కాసేపు, కమల హాసన్ స్టయిల్‌లో కాసేపు నిలబడి ఫోజులు కొట్టినాడు.

వాళ్ళ కొట్టంలోని ఎర్ర ఆవు మొన్నటికి మొన్న ఒకే ఈతలో రెండు దూడల్ని ఈనింది కదా... ఆ రెండు కోడె దూడలూ ఆవు పాలు తాగేది నిలిపేసి, కిష్టడి నంగి నంగి చేష్టల్ని విచిత్రంగా చూడసాగాయి.

ఇంతలో కిష్టడి అమ్మ నారాయణమ్మ ముగ్గు రాళ్ళ మిట్టకాడికి పోయి ఆవులకి గడ్డి కోసుకొని వచ్చింది.

కిష్టడి చేతిలోని కొత్తిమీర కట్ట చూసి–

"కొడకా! నా పైన నీకు ఎంత ప్రేమ రా! ధనియాలు చల్లి కొత్తిమీర పెంచినావు!" అని ముద్దులాడింది.

ఇంట్లో అందరికన్నా చిన్నోడు కదా... భలే ముదిగారంలే నారాయణమ్మకి కిష్టడంటే.

వాడిని చూసి, వాడి స్టయిల్‌ని చూసి నారాయణమ్మ– "కొడకా! ఎంత మంచి పుట్టక రా నీది! ఏ పిల్ల చేసుకొంటదో కానీ నిన్ను! దాని జన్మ జన్మల నోముల ఫలమై ఉంటదిరా" అని అనింది.

ఒళ్ళంతా స్ప్రింగు మింగినోడి లెక్కన... వయ్యారాలు పోతా ఉంటే, చిక్కుడు చెట్టుకాడ ఎవరో వచ్చి నిలబడినట్లు ఉంటే వెనక్కి తిరిగి చూసినాడు.

మరదలు మీనాక్షి గజ్జెల గుర్రం లెక్కన ముసిముసిగా నవ్వతా నిలబడి వుంది.

"ఏమి కావాలమ్మీ?" అని అడిగినాడు .

"మా అమ్మ పప్పు రసం పెడ్తా ఉందంట. కొంచెం కొత్తిమీర వుంటే తీసక రమ్మంది!" అని తెలుగు సినిమాలో హిందీ హీరోయిన్‌లా, పొడిపొడి మాటలు మాటాడింది.

కిష్టడు సిగ్గు మొగ్గలైనాడు.

వాళ్ళ అమ్మ పక్కన లేకుంటే, జాతరకి వేసే పులి అడుగు వేయాలనిపించింది కిష్టడికి.

'అయినా ఊర్లో వాళ్ళు ఎవరైనా చూస్తే మానం పోతుంది కదా?!...' అనుకొని పులి అడుగులేయలేదు.


ఆ అమ్మిని క్లోజ్అప్‌లో చూసే ఛాన్సు దొరికింది కదా, అని ఓరగా చూసినాడు.

'ప్రాయంలో పంది పిల్లయినా ముద్దు ముద్దుగనే వుంటాదిరా కిష్టా!' అని అమ్మ ఎన్నిసార్లు చెప్పలేదు?

'దగ్గరిగా ఇంకొక్కసారి ఆ అమ్మిని చూస్తే నా అబ్బ గంటు ఏమీ పోదు కదా' అనుకొన్నాడు.

**లాఫ్ లైన్స్**

**సూటిగా మాట్లాడేవారికి శత్రువులు ఎక్కువ! మాయమాటలు చెప్పేవాడికి మిత్రులెక్కువ!**



'నిజంగా ఆ అమ్మి బాగుంటుందా... లేక ఆ అమ్మి కట్టే చీరల వల్ల ఆ అమ్మి బాగుంటుందా' అని నైసు నైసుగా ఆ అమ్మిని చూసినాడు.

మనసులోనే నూటికి ఎనభై మార్కులు ఇచ్చుకున్నాడు. తనకు తానే ఒకటికి పదిసార్లు టిక్కులు ఇచ్చుకున్నాడు.

✦ ✦ ✦

మరదలు పిల్ల కొత్తిమీర అడిగిందే భాగ్యం అన్నట్లుగా కిష్టడు చకచకా కొత్తిమీర కోస్తూ...

"వీళ్ళు కొత్తిమీర కావాలని, అడగతారని తెలిసి ఉంటే నాయన సంపాదించి పెట్టిన నాలుగు కయ్యిల్లోనూ కొత్తిమీర తోటలు నాటి ఉంటాను కదా! ఈ ధనియాలు చల్లే పని నాలుగేండ్ల ముందే చేసి ఉంటాను కదా!" అనుకొంటూ గట్టిగా గాలి పీల్చి గాలి వదులుతుంటే ముక్కు మీది వచ్చీ రాని నూనూగు మీసాలు గాలికి అటూయిటూ ఊగినాయి.

కొత్తిమీర కోస్తున్న కిష్టడు, మీనాక్షి కళ్ళకు జగదేక వీరుడి మాదిరి కనిపించినాడు.

కిష్టడినే చూస్తున్న మీనాక్షి చీర పైట జారాలని చూస్తోంది కానీ, జాకెట్టు కాడి పిన్ను, పైటను గట్టిగా పట్టుకొని ఉంది. ఏదో ఒకటి చేస్తున్నట్లు ఉండాలని మీనాక్షి చిక్కుడు చెట్టు పక్కనున్న మరువం ఆకులు కోసి ముక్కు కాడ పెట్టుకొని... ఆ మధురమైన వాసన పీల్చ సాగింది.

నారాయణమ్మ కాసేపు మీనాక్షి వైపు... కాసేపు కిష్టడి వైపు... చూసి ముసిముసిగా నవ్వుకొంది.

శిరుగురాజుపాలెంకి సైకిల్లో పోయి అప్పుడే వచ్చిన కిష్టడి మేనమామ మునివేలు ముక్కు పొడి పీలుస్తూ కిష్టడి చేతిలోని కొత్తిమీర కట్టనీ, మీనాక్షి చేతిలోని మరువంని చూస్తూ, భూటాన్ లాటరీ టికెట్టు కొట్టినంత సంబరపడిపోతూ ఇంట్లోకి పోయినాడు.

కట్టెల పొయ్యిపైన పప్పు రసం ఉడకతా ఉంటే...గెరిటతో తిప్పతా జెనల్ (కిటికీ) గుండా బాల్కనీలో నుండి సినిమా చూసినట్లు చూస్తా...

'కోరిన కొండ మీద వాన పడతా వుంది కదా' అని అనుకొంది కిష్టడి మేనత్త.

## మినీ హాస్య కథల పోటీ



హాస్యానందం సౌజన్యంతో శ్రీ బాబు కొయిలాడ గారు తమ తండ్రి **శ్రీ కొయిలాడ వెంకునాయుడు** గారి పేరిట మినీ హాస్య కథల పోటీని నిర్వహిస్తున్నారు. ఔత్సాహిక రచయితలు అందరూ తమ రచనలను పంపించి, ఈ పోటీని విజయవంతం చేయాల్సిందిగా మనవి.

**అంశం : ప్రవాసాంధ్రులు**

| | |
|---|---|
| మొదటి బహుమతి | - రూ.1500 |
| రెండవ బహుమతి | - రూ. 800 |
| ప్రత్యేక బహుమతులు (పది) | - రూ. 300 లు చొప్పున |

**నిబంధనలు :**

- ✦ వ్రాతప్రతి రెండు పేజీలకు మించరాదు.
- ✦ డి.టి.పి. అయితే ఒక పేజీ మాత్రమే పంపవలెను.
- ✦ ఒకరు ఒక కథని మాత్రమే పంపవలెను.
- ✦ సున్నితమైన హాస్యంతో, కొసమెరుపుకి ప్రాధాన్యం.
- ✦ కథ ఇంతకుముందు ఎక్కడ ప్రచురించబడలేదని, ఏ పత్రిక పరిశీలనలో లేదని, కాపీ కాదని హామీ పత్రం ఇవ్వాలి.
- ✦ విజేతల వివరాలు 'హాస్యానందం'లో ప్రచురించబడతాయి.
- ✦ కథ చివరి పేజీలో పేరు, హామీపత్రం, చిరునామా రాయాలి.

**కథలు మాకు చేరాల్సిన ఆఖరు తేది : ఆగస్టు 20, 2021**

**కథలను ఈ మెయిల్‌కి పంపండి :**
hasyanandampoteelu@gmail.com

మా తండ్రి గారు శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారు 1936 లో బర్మాలో జన్మించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో భారతదేశానికి తిరిగివచ్చారు. ప్రవాసాంధ్రుల జీవితాలపై ఆయనకు మక్కువ, ఆసక్తి ఎక్కువ.
**ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న మినీ హాస్య కథల పోటీలో రచనలను ప్రవాసాంధ్ర జీవితాల నేపథ్యంలో రాయాల్సి ఉంటుంది.**
నేడు ఎందరో తెలుగువారు విద్య, ఉద్యోగ అవకాశాల నిమిత్తం అమెరికా, దుబాయ్, సింగపూర్, కొరియా, మస్కట్ లాంటి ప్రాంతాలకు తరలి వెళుతున్నారు. అలాగే మన దేశంలోనే ముంబయి, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా లాంటి రాజధాని నగరాలలో కూడా జీవిస్తున్నారు. అయినా ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లిని అన్నట్లు, తెలుగువారు అన్ని ప్రాంతాలలోనూ తమ ప్రతిభను, ఉనికిని చాటుతూనే ఉన్నారు. మీ కుటుంబీకులలో, మిత్రులలో కూడా ఎందరో ప్రవాసాంధ్రులు ఉండే ఉంటారు. ఇంకెందుకు ఆలస్యం? వారి జీవితంలోని ఘటనలను కథలుగా మార్చేయండి మరి. లేదా మీ ఊహకు కూడా పదును పెట్టవచ్చు.
అయితే రచన హాస్యభరితంగా ఉండాలి సుమా.

శుభాభినందనలతో... **కొయిలాడ బాబు,విశాఖపట్టణం**






# కె.వి.వి సత్యనారాయణ ఫన్ ప్రశ్నలకు- సుదర్శనమ్ పంచ్ సమాధానాలు

*Cartoons: Sangram*

✦ వెధవ డబ్బుల్దేముందండీ... కుక్కను కొడితే రాల్తాయి అంటారు కదా? మరి నేనుకొడితే రాలలేదే?



**'వెధవడబ్బు' లయితే... వెధవల దగ్గరే ఉంటాయి! రాలాలంటే పట్టాల్సింది వాళ్ళనీ... కొట్టాల్సింది కుక్కల్ని కాదు!**

✦ మత్తు పదార్థాన్ని 'మందు' అంటారు. ఔషధాన్ని కూడా 'మందు' అనే అంటారు. రెండింటికి ఒకే పేరు ఎలా వచ్చిందంటారు?




**వెయ్యడానికీ... వేసుకోవడానికీ... ఉన్న తేడా తెలియకపోవటం వల్ల!... అదైనా... ఇదైనా... 'రోగం' కుదరటానికేగా!... ఏమీ డౌట్స్?!**

✦ గురూగారూ... గుండు సరే! గడ్డమైనా పెంచచ్చు కదా?



**పెరగని దానికే 'ఇంత' మెయిన్‌టెనెన్స్ కాస్ట్ అవుతుంటే... పెంచేదానికి 'ఎంత' అవుద్దో ఓసారి ఆలోచించండి...! స్పాన్సరింగ్‌కి మీరు ఒకే అంటే... నాకు ఒకే!**


✦ మహానుభావా! పొరుగువారిని ప్రేమించమన్నారు కదా? మా పొరుగింటావిడకు పెళ్ళయింది... ప్రమాదం ఏం ఉండదు కదా?



**ఎందుకుండదూ?...మీలాగా ఆడాళ్ళు 'ప్రేమ'తో సరిపెట్టరు...! పెళ్ళి చేస్కుందామంటే??... ప్రమాదం మీకు...ప్రమోదం వాళ్ళాయనకి!**

✦ ఒక్క గాడిదనే 'అడ్డగాడిద' అంటారు... అడ్డ కుక్క, అడ్డ పంది అని అనరెందుకని?

**'అడ్డమైన' మనుషులు 'అలా' అంటే...అవి ఒప్పుకోవు!**



✦ ఉచిత విద్య... ఉచిత వైద్యం లానే ఉచిత మద్యం ఇచ్చేస్తే మన దేశం ఎలా ఉంటుందంటారు?

**(ప్రభుత్వ) బొక్కసానికే బొక్కెట్టే ఆలోచనలు... మీకు ఎక్కడ్నుంచి వస్తున్నాయి మాస్టారూ?!**



✦ ఆడవారు మేకప్ మానేస్తే దేశజనాభా నియంత్రణలోకి వచ్చేస్తుందనుకుంటాను. మీరేమంటారు?

**ఇంపాజిబుల్!... 'కొప్పు' ఉంటే(ఐతే) చాలు... 'మేకప్పు'తో పని లేదు... అనే జనం దేశంలో చాలామంది ఉన్నారు... అని న్యూస్ ఘోషిస్తోంది!!**



✦ అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు కదా? చపాతిలోనూ, పరోటాలోనూ దేవుడు లేడాండి?

**అవన్నీ... మీకు తెలుసున్నావిడ 'ఒకావిడ' మహా బాగా చేస్తుందని మీ ఆవిడతో అనండి... అపుడు తెలుస్తుంది... దేవుడున్నాడో లేడో!!**



✦ పాపం! మీరు క్షవరం చేయించుకోక పోవటంవల్ల మీ క్షురకుడు క్షవరం అయిపోయుంటాడు కదా?

**'నిత్యం' చేయించుకోవటం వల్ల... నేను 'క్షవరం' అయిపోతున్న సంగతి, మీకు తెలీదనుకుంటా! 'క్షవరం నాకు, సానుభూతి అతగాడికి'... అన్నట్టుంది మీ ధోరణి!**





✦ ప్రస్తుతం మన సినిమాల్లో (ఓటీటీ) ...... (ఎడిట్) మోతాదు మించి ఉంటున్నాయి... ఈ చిత్ర నిర్మాతలు సమాజానికి ఏం సందేశం ఇస్తున్నట్టు సుదర్శన్‌గారూ!

**ఇంతకీ, 'ఎడిట్' లేకుండా... 'మోతాదు మించి' ఉన్న ఓటీటీ సినిమాలు మీరు ఏ 'సందేశం కోసం' చూసినట్టు కేవీవీగారూ!**







✦ తాగి బండి నడపకూడదు కదా? మరి బార్‌ల ముందు బళ్ళు బార్లు తీరి ఎందుకుంటాయి?

**తాగేవాడికున్న తెలివి మీకు ఉన్నట్టు లేదు... అందుకే నడిపే మీలాంటి వాళ్ళని తోడు (కంపెనీ) పట్టుకుపోతారు... ఫ్రెండ్లీగా! (బిల్లు కూడా మీరు కడతారు... అది బోనస్... వాడికది తెలుసు)!**

✦ 'దండం దశగుణ భవేత్' అన్నారు కదా? మరి ఇప్పుడు పిల్లల్ని దండిస్తే తల్లిదండ్రులు తిరగబడుతున్నారేంటీ?

**దండించినందుకు కాదు... తమకి లేని ఆ (సు)గుణాలు... దండిగా పిల్లలకొస్తే ప్రమాదమని!**





✦ మొగుడు పెళ్ళాలు అన్నారు కదా? బహు భార్యాత్వం చట్టబద్ధమేనా?

**'ఆలు(లి)మగలు' అని కూడా అన్నారు... మరి బహు 'భర్తృత్వం' చట్టబద్ధమేనా?...లాజిక్కేగా?**

# ఉద్యోగోపాఖ్యానం

దంతులూరి వర్మ, 9492816754

**ఎప్పుడూ తల, ఒళ్ళు మీద శ్రద్ధ పెట్టని సతీష్ మార్నింగ్‌వాక్ సమయంలో మొబైల్ ఇంట్లో వదిలేసి మరీ హెయిర్ కటింగ్ సెలూన్‌కి దారి తీసాడు.**

**విశాఖ నౌకాశ్రయంలో ఎగుమతి దిగుమతుల్లో బిజీగా ఉండే ఓ ప్రముఖ సంస్థలో మోటార్ గేరేజ్ ఇన్‌ఛార్జ్ అవడంవల్ల రోజులో 24 గంటలూ డ్యూటీలో ఉన్నట్టే ఉంటాడు. మొబైల్స్ వాడకంలోకి వచ్చాక మరీ అధ్వాన్నమయిపోయింది జీవితం.**

వేళకు భోజనం లేకపోవడం వలన బక్క చిక్కిపోయి దుమ్ము ధూళితో తిరగడం....తీరిక లేకపోవడంతో ఎప్పుడూ పెరిగిన గెడ్డంతో చింపిరి జుత్తుతో... పెద్ద వయసు వాడిలా ఉంటాడు సతీష్.

సతీష్ శ్రీమతి సరోజ సన్నగా నాజూగ్గా ఉండడంతోపాటు తరచూ బ్యూటీపార్లర్‌కి వెళ్ళడం వలన తన వయసుకంటే చిన్నదానిలా కనిపిస్తుంది.

తామిద్దరూ ఎక్కడికైనా కలిసి వెళితే...

"ముసలి మొగుడు....పడుచుపెళ్లాం" లా ఉంటామని అందుకని సతీష్‌ని డై వూసుకోమని పోరుపెట్టి విసిగిపోయింది సరోజ.

ఓ నెల రోజుల క్రితం జరిగింది సతీష్‌కి గుర్తుకొచ్చింది.

'రాత్రీపగలూ తేడా లేకుండా ఎంతసేపూ ఉద్యోగం...గేరేజ్ అంటారే గాని... ఇంటి గురించి పట్టించుకోవడం లేదు. స్వంతిల్లు ఎలాగూ లేదు... కనీసం అద్దె ఇల్లయినా సౌకర్యంగా ఉండేది చూసుకోవాలనే ధ్యాస లేద'ని సరోజ చిఱుబుఱులాడుతుందని కొత్తగా అద్దెకు దిగబోతున్న ఇంటికి వెళ్లాడు సతీష్.

పెయింటర్స్ పెయింట్స్ వేస్తున్నారు.

ఇల్లంతా తిరిగి చూసి మా సరోజ మంచి ఇల్లే వెతికిందే అనుకున్నాడు సతీష్.

"సార్! ఈ ఇంట్లో మీరు దిగుతారా? మీ అమ్మాయి గారు దిగుతారా?"

ఓ పెయింటర్ అడిగినదానికి ఉలిక్కిపడ్డాడు సతీష్.

"ఉదయం అమ్మగారు... అమ్మాయిగారు వచ్చి ఇల్లంతా చూసి వెళ్ళారండి!"

సతీష్‌కి విషయం అర్థమయింది.

సరోజ ఉదయం వాళ్ళక్కతో కలిసి వచ్చుంటుంది. ఆవిడ లావుగా నెరసిన జుట్టుతో ఉండటం... సరోజ సన్నగా నల్లటి జుత్తుతో ఉండడంతో పెయింటర్ వారిద్దరినీ తల్లీ కూతుళ్ళని పొరపడుంటాడు.

తనింకా అక్కడే వుంటే పెయింటర్ ఇంకేం అడుగుతాడో అని భయపడి 'మేమే దిగుతాం' అంటూ వెనుతిరిగాడు సతీష్.

✦ ✦ ✦

రండి సార్!...రండి!!"

మొహానికి నవ్వు పులుముకుని పొద్దుటే బోణీబేరం వీడొచ్చాడేమిట్రా అని మనసులో తిట్టుకుంటూ ఆహ్వానించాడు సెలూన్ ఓనర్.

"షేవింగేనా సార్?" సతీష్ చైర్‌లో కూర్చోగానే అడిగాడు సెలూన్ ఓనర్.

"కటింగ్...షేవింగ్...కలరింగ్..." చెప్పాడు సతీష్.

నెలకొకసారి షేవింగ్‌కి, మూడునెలల కొకసారి కటింగ్‌కి వచ్చే సతీష్ నోటంట ఆ మాట రాగానే ఆశ్చర్యపోయి పొరపాటున విన్నాడేమోనని మరోసారి అడిగాడు.

"కటింగ్....షేవింగ్....కలరింగ్..." మరోసారి చెప్పాడు.

కటింగ్ మొదలుపెడుతూ అడిగాడు.


"మీకు ఏ హీరో అంటే ఇష్టం సార్?"

"జూనియర్ ఎన్.టి.ఆర్."

"ఆయనది ఏ సినిమా ఇష్టం సార్?"

"నాన్నకు ప్రేమతో."

సెలూన్ ఓనర్ ఏదో మాట్లాడుతున్నా...




## లాఫ్ లైన్స్

పొంగలి చేయనా?...
పులిహోరా చేయనా?...
పొంగలి, పులిహోరా మనవి..
చైనా వాడివి కాదు...
చైనా చైనా అని చంపకు.

గతంలోకి జారిపోయాడు సతీష్.

పదిహేను రోజుల క్రితం మెట్ల మార్గం ద్వారా సింహాచలం కొండెక్కుతున్నారు సతీష్ దంపతులు.

పిల్లల మంచికోసం కాలినడకన కొండెక్కు తామని మొక్కుకుంది సరోజ.

పిల్లలిద్దరినీ యాత్రకు రమ్మంటే – "మాతో చెప్పకుండా నిన్నెవరు మొక్కుకోమన్నారు? మేం రాం ఫో!" అన్నారు పిల్లలిద్దరూ.

సరోజకు సాయంగా వెళ్లక తప్పలేదు సతీష్‌కు.

సరోజ సునాయాసంగా మెట్లు ఎక్కేస్తోంది. సతీష్ ఆయాసంతో అవస్థపడుతూ... 'ఇంకా ఎన్ని మెట్లెక్కాలిరా దేవుడా' అనుకుంటూ మెట్ల పక్కనున్న చెట్టు నీడన కూలబడ్డాడు.

"ఏ ఊరు మనది?"

అప్పటికే అక్కడ కూర్చున్న ముసలాయన పలకరించాడు.

సతీష్ చెప్పాడు.

"పాప చూడు! చెంగు చెంగుమని ఎలా ఎక్కుతోందో...అలా మనమూ ఎక్కామనుకో... కాలు జారి ఏ మక్కో విరిగి మంచం పట్టేస్తాం!" ఆగకుండా మెట్లెక్కుతున్న సరోజను చూపిస్తూ అన్నాడు ముసలాయన.

'ఈ ముసలాడు నన్నూ ముసలాడను కుంటున్నాడు ఖర్మ!...' మనసులోనే తిట్టుకున్నాడు.




"పాపలో సాంప్రదాయం ఉట్టిపడుతోంది."

"అవునవును!"

సరోజను అలా అన్నందుకు సతీష్‌లో ఆనందం పొంగి అలసట మాయమయింది.

"పాపకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారా?'' కుతూహలంగా అడిగాడు ముసలాయన.

"నాకు అమ్మాయిలు లేరు. ఇద్దరూ అబ్బాయిలే."

"నీతో కలిసి వచ్చి లేడిపిల్లలా చకచకా ఎక్కుతోందే ఆ పాప?" అంటూ సరోజను చూపించాడు.

లంగా ఓణీ మోడల్ చీర కట్టుకుని పోనీ టెయిల్ వేసుకున్న సరోజ దూరానికి చిన్నదానిలాగే కనిపిస్తున్నాది.

"ఆమె నా భార్య!" చిరాగ్గా చెప్పాడు సతీష్.

"ఓహో!...అవునా!! ఇద్దరికీ వయసు చాలా తేడా ఉన్నట్టుంది... మేనకోడల్ని చేసుకున్నావా?"

సతీష్‌కి ఒక్కసారే ఒళ్ళుమండింది.

"ముందు అర్జెంటుగా మీ కళ్ళు పరీక్ష చేయించుకోండి." ముసలాయనతో చిరాగ్గా అన్నాడు సతీష్.

తనని హెయిర్‌డై వేసుకోమని... సరోజ ఎందుకు పోరు పెడుతోందో సతీష్‌కి అర్థమయ్యింది. ఇక్కడే ఉంటే ఈ ముసలాడు ఇంకేం అడుగుతాడో అని లేచి వేగంగా మెట్లెక్కడం మొదలుపెట్టాడు.

"సార్! అయిపోయింది... అద్దంలో చూసుకోండి."

గతంలోంచి బయటపడి తనని అద్దంలో చూసుకుని అవాక్కయ్యాడు సతీష్.

అచ్చు నాన్నకు ప్రేమతో సినిమాలో జూనియర్ ఎన్‌టిఆర్ క్రాపింగ్‌లా ఉండి ఓ పది సంవత్సరాలు వయసు తగ్గినట్టనిపించింది.

"సార్ డై వేసుకున్నవాళ్ళు మీసం కలర్ మెయింటెయిన్ చెయ్యడం కష్టం తీసెయ్యమంటారా?"

"ఎలా బావుంటుందంటే అలా చెయ్యి!" చెప్పాడు సతీష్.

నున్నగా మీసం గొరిగేసిన తర్వాత అద్దంలో చూసి ఇరవై సంవత్సరాల వయసు తగ్గినట్టుగా అనిపించి అదనంగా ఓ పదిరూపాయలు టిప్ కూడా ఇచ్చి ఇంటి ముఖం పట్టాడు.

✦ ✦ ✦

"సినబాబు... మీ పెండు ఎవులో వత్తన్నాడు..."

వీధి వాకిలి కడుగుతున్న పనిమనిషి పిలుపుతో బయటకొచ్చిన చిన్నబాబు ఎదురుగా కనిపించిన తండ్రిని చూసి కిసుక్కున నవ్వాడు.

"మమ్మీ!...ఎవరొచ్చారో చూడు!" అరిచాడు చినబాబు.

"ఎవర్రా?..." తల దువ్వుకుంటూ సరోజ బయటకొచ్చింది.

'సరయిన కేశసంరక్షణ లేక గాని... నా మొగుడు అందగాడే!' అనుకుంటూ సతీష్‌ని చూసి మురిసిపోయింది సరోజ.

"మమ్మీ! డాడీ ఇప్పుడెలా ఉన్నారు?..."




"చాక్లెట్ బోయ్‌లా వున్నారు." టీ.వీ. ఏడ్ గుర్తు చేసుకుంటూ అంది సరోజ.

"ఓలమ్మో! పెద్దయ్యగోరా?... నానసలు పోల్చుకోలేకపోనాను..." ముక్కుమీద వేలేసుకుంది పనిమనిషి.

"మావాళ్ళది హాఫ్ శారీ ఫంక్షన్‌కి వెళ్లాలి. ఫంక్షన్ ఎల్లుండి అనుకుని నేను రెడీ అవలేదు. ఈ రోజే అని ఇప్పుడే ఫోన్ వచ్చింది. మీరు స్నానం చేసి త్వరగా తయారవ్వండి."

"ఇప్పటి అమ్మాయిలు చున్నీలే వాడటం లేదు. ఇప్పుడు ఈ హాఫ్ శారీ ఫంక్షన్ ఎందుకో డబ్బు దండుగ!" అన్నాడు సతీష్.

"ఆ దండగ సంగతి మనకెందుకు. మీరు ఏ ఫంక్షన్‌కి రావడంలేదని మావాళ్ళు ఎప్పుడూ అంటూంటారు. స్నానం చేసి త్వరగా రెడీ అవండి. ఇద్దరం కలిసి వెళ్దాం." అంది సరోజ.

'మీకు సెలవు దొరకదు...వీలు పడదు... నన్ను ఫంక్షన్ హాలు దగ్గర దించేసి వెళ్లిపోండ'ని ఎప్పుడూ చెప్పే సరోజ ఈ రోజు కలిసి వెళ్దామనగానే 'డై' మహిమ అర్థమయింది సతీష్‌కి.

హుషారుగా స్నానానికి వెళ్లాడు.


✦ ✦ ✦

పిల్లల సూచన మేరకు జీన్‌పేంట్, టీషర్ట్ వేసుకున్న సతీష్‌ని చూసి ఆనందంతో... ఉబ్బి తబ్బిబ్బవుతున్నాది సరోజ.

ఫంక్షన్ హాల్ దగ్గర సరోజను దింపేసి

## లాఫ్ లైన్స

ఇల్లు... తాళి... రెండూ బాగా ఆలోచించి కట్టాలి. లేదంటే... మొదటిది అప్పులపాలు చేస్తుంది... రెండోది తిప్పలపాలు చేస్తుంది.



పార్కింగ్ ప్లేస్ వెదుక్కోవడం మొదలెట్టాడు సతీష్.

"గేరేజ్ నుండి అర్జెంట్‌గా ఫోన్ వచ్చిందని అలా వెళ్లిపోకండి... ఎప్పుడూ రాని మీరు వచ్చారంటే మా వాళ్ళు చాలా సంతోషిస్తారు."

"అలాగేలే..." అన్నాడు సతీష్.

"ఏమే సరూ!... ఇంత ఆలస్యంగానా రావడం?..." ఫంక్షన్ హాల్ గేటు దగ్గర నిలబడి దిక్కులు చూస్తున్న బామ్మ వరసయ్యే పెద్దావిడ అడిగింది.

"ఫంక్షన్ ఈ రోజన్న సంగతి మరిచి పోయాను బామ్మ!"

"అవున్లే!...నీకూ వయసు మీద పడుతున్నాది కదా?! మతిమరుపు వచ్చేస్తుందిలే!" అంది బామ్మ.


ఆ మాటకు షాకయ్యింది సరోజ.

డ్రై వేసుకునే టైం లేక సడన్‌గా బయలుదేరి పోవడంతో ఈ ముసల్ది నన్నూ ముసలిదాని కింద జమ కట్టేస్తుందని మనసులో తిట్టుకుంది.

"ఆయన బయటికెళ్ళి రావడం ఆలస్యమైంది బామ్మ!"

"మీ ఆయనకి వీలు పడకపోతే ఆటోలోనో, అదేదో కేబ్‌లోనో రావాలి గాని... కుఱ్ఱ వెధవలకి బండివ్వకూడదే అమ్మాయ్!"

"ఒళ్ళు తెలియకుండా రోడ్లమీద సర్కస్‌లు చేస్తూ దేన్నో గుద్దేసి ప్రాణాలొదలడం టీవీలో, పేపర్లో బోల్డన్ని చూస్తున్నాం. వాళ్ళకేం వాళ్ళు బాగానే పోతారు. కని పెంచిన తల్లిదండ్రులకే నమ్మాయ్ కడుపుకోతంతా!"




"అవును బామ్మ మీరు చెప్పింది నిజం!"

బండి పార్క్ చేసి సరోజ దగ్గరకు వచ్చాడు సతీష్.

"ఏరా బడుద్దాయ్! వేలెడంత ఉండేవాడివి. అప్పుడే బండి నడిపేంత పెద్దవాడివయి పోయావా?.." అడిగింది బామ్మ.

సరోజ, సతీష్‌లు... అయోమయంగా మొహాలు చూసుకున్నారు.

"మీ నాన్న ఎలాగూ ఫంక్షన్‌కి రాడు. పోన్లే నువ్వయినా మీ అమ్మను తీసుకొచ్చావు... సంతోషం!" అంది బామ్మ.


"అయ్యో బామ్మా!... ఈయన మా వారు!!" అంది సరోజ.

"అయ్యో!...అయ్యో!!...ముందు చెప్పాకోవటే. బాబూ ముసలిముండని... కళ్ళు కనిపించక నిన్ను మీ అబ్బాయనుకుని ఏదేదో అనేసాను. ఏమీ అనుకోవద్దు బాబూ..." సిగ్గు పడిపోతూ అంది బామ్మ!

"ఏం ఫర్లేదండి! పెద్దవారు మీరు."

తనని తన కొడుకనుకున్నందుకు ముప్ఫై సంవత్సరాల వయసు తగ్గినట్టు అనిపించి... చాలా గర్వంగా ఫీలయ్యాడు సతీష్.

డ్రై వేసుకునే టైమ్ లేక సడన్‌గా బయలు దేరిన తనకు ఇక్కడ ఇంకెన్ని అనుభవాలు ఎదురవుతాయో అనుకుంటూ సతీష్‌తో కలిసి లోపలికి నడిచింది సరోజ.




**లాఫ్ లైన్స్**


**భూమి తన చుట్టు తాను తిరుగుతూ సూర్యుడి చుట్టు తిరుగుతుంది.**


**భర్త తన చుట్టు తాను తిరుగుతూ భార్య చుట్టు తిరుగుతాడు**


# నెల నెలా నవ్వుల వెన్నెల


ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- కరెంట్

























సీరియల్‌లో అత్తగారు కరెంట్ వైర్‌పై కాలు వేస్తుందో, లేదా అని చూస్తుంటే-ఏమిటా చావు కేకలు!!



కరెంట్ ఎఫైర్స్ గురించి మాట్లాడమంటే రాష్ట్రంలో, కేంద్రంలో, మా ఇంట్లో కరెంట్ కోత ఎక్కువగా వుందని చెపుతావే. ఏం తిక్క తిక్క గా వుందా?
INTERVIEW MEMBER



మీరే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారండీ!?
ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో నండీ!...
SARMA


పోయిన పండక్కు మీరు కొనిచ్చిన పెట్రోల్ కారు వల్ల ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేలా వుంది..అందుకే ఈ పండక్కు కరెంట్ తో నడిచే కారు కొనివ్వమంటున్నారు నాన్నా, మీ అల్లుడుగారు.


బ్రేకింగ్ న్యూస్


ఇప్పుడంటే క్యాండిల్ లైట్ డిన్నర్ అంటున్నారు కానీ, చిన్నప్పుడు కరెంట్ పోతే మేమిదే చేశేవాళ్ళం...
csk


కార్టూనిస్ట్
దానికి కరెంటు ఎలా వస్తోందీ!!
పెండేల


మనింట్లో గ్రైండర్లు, వాషింగ్ మిషన్ ఉన్నా...! కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని నా చేత ఇలా చేయించడం ఏం బాగాలేదు రాజ్యం...!
అయ్యప్ప



# బాస్ ఆన్‌లైన్ మీటింగ్

డా॥ డి.ఎన్.వి. రామశర్మ, 9663526008

**"ఇంకొక గంటలో స్పెషల్ మీటింగ్ మొదలవుతుంది. ఈరోజు మన పెద్ద బాస్ వస్తున్నారు తయారుగా ఉండండి"**

**ఉదయం 8 గంటలకే మొదలైన రోజువారి సబ్ టీమ్ మీటింగ్‌లో చెప్పాడు మంజునాథ్ అందరికీ.**

**"ఎస్... మహా కర్కోటకుడు సడన్‌గా మీటింగ్ ఎందుకో?" సందేహాన్ని వ్యక్తం చేసాడు అందరితో కలగలిసి సరదాగా ఉండే 'మణి' అని పిలిపించుకునే మణివన్నన్.**

మామూలుగా ఆఫీస్ మీటింగ్‌కి ఠంచనుగా టైమ్‌కి వస్తాడాయన. ఇపుడూ అంతే!...

అడిగిన రిపోర్ట్స్ అన్నీ సిద్ధం చేసుకుని ల్యాప్‌టాపుల ముందే కూర్చున్నారు ఎవరిళ్ళల్లో వాళ్ళు.

కరోనా సమయం నేర్పిన కొత్త పద్ధతుల్లో వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్స్ టెక్నాలజీ మీద ఆధారపడటం ఎక్కువైంది కదా అన్ని చోట్లా.

"అందరూ పది నిమిషాల ముందే జూమ్ లోకి రండి... రోజూ లాగా మీ ఇష్టం కాదు... ఆయన నాలా కాదు... ఇట్టే తిట్టేస్తాడు!"

హెచ్చరికగా మళ్ళీ చెప్పాడు టీమ్ మెంబర్స్‌తో సరదాగా ఉంటూ కావలసిన పని చేయించుకునే సమర్థుడైన టీమ్ లీడర్ మంజునాథ్.

"రవీ! నీ వీడియో బంద్ లో ఉంది... ఓపెన్ చేయ్!" రవిని ఉద్దేశించి చెప్పాడు మంజునాథ్.

వీడియో ఆన్ చేసాడు హడావిడిగా రవి.

అందరూ పెద్దగా నవ్వేసారు.

రవి బనీను, బర్ముడా వేసుకొని మంచం మీద పడుకుని క్యాజువల్‌గా కనిపించిన దృశ్యం చూసి–

"నాయనా! రవీ.. చూడలేకపోతున్నాం బాబూ! వీడియో కట్టేయ్... ఇది ఆఫీస్ మీటింగ్‌రా ఇంట్లో ఉన్నట్లు ఏంట్రా చెడ్డీతో బడ్డీ... అదీ బాస్ వస్తున్న రోజు..." పెద్దగా నవ్వుతూ అన్నాడు మణి.

"సారీ యార్... మర్చేపోయాను...రోజూ ఆడియోలో కదా మన మీటింగ్..." చెప్తూ సిగ్గుతో రవి ఓపెన్ చేసిన వీడియోని ఆపేశాడు.

"ఏంటి కృష్ణా!...మీ గోడ వెనక రాతలన్నీ?" అడిగాడు మంజునాథ్.

"అవన్నీ...మా అమ్మాయి గోడలమీద వేసిన పెన్సిల్‌గీతలు. మోడ్రన్ ఆర్ట్." అనుకుంటూ... విషయం చెప్పాడు కృష్ణ.

"చెప్పు! చెప్పు!! కోతలు... మొన్న మీ ఇంటి ఓనర్ వచ్చి అది చూసి అరిచెళ్ళిన తర్వాత పెయింటింగ్ వేయించావుగా..." ఆట పట్టించాడు మణి.

"మా అమ్మాయి తెల్ల గోడ కనిపిస్తే చాలు... పెన్సిళ్ళ వాడకం ఆపదురా బాబూ!" తన బాధ చెప్పుకోలేకపోతున్నాడు కృష్ణ.

"ఈరోజు ఏంటి మన బాబాయ్ మనోజ్ గారు దుబాయ్‌లో ఉన్నట్టున్నారు... బుర్జ్ ఖలీఫా ముందున్నారే...నిన్న ఇండియాలోనే కదా... ఫ్లైట్ ఎప్పుడెక్కారు సర్?" చనువుగా అడిగాడు అల్లరి మణి మరో టీమ్ మెంబర్ మనోజ్‌ను చూస్తూ.

"నా మొహానికి దుబాయ్ కూడానా? అందులోనూ కరోనా తోక పట్టుకొని... బ్యాగ్రౌండ్ మార్చానురా మణీ !..." అసలు విషయం చెప్పాడు భారీకాయంతో ఉన్న మనోజ్ ఆయాసంగా... పక్కనే ఉన్న చిప్స్ తింటూ.

"ఓహో!...ఆ సదుపాయం బాగానే ఉందే.. నాకూ నేర్పరా బాబూ... అంబానీ ఇంట్లో ఉన్నట్టు సీన్ పెట్టుకుంటా!"



## లాఫ్ లైన్స్

**జీవితాంతం భర్తకు**
**భయపడుతున్నట్లు నటించి**
**భయపెట్టేది భార్య!**
**భార్యను భయపెట్టాలని**
**ప్రయత్నించి భయపడుతూ**
**బతికే జీవి భర్త!**



మాసిన గోడను చూస్తూ నీరసంగా అన్నాడు కృష్ణ.

"సరిసరీ... పొద్దున్నే చిప్స్ తినడం ఆపితే మంచిదేమో...లాక్‌డౌన్‌లో ఎలాగూ కంట్రోల్ తప్పి అడ్డూ అదుపూ లేకుండా బొజ్జ పెంచేవు బాబాయ్... వర్క్ ఫ్రమ్ హోమ్‌లోనూ అలానే కంటిన్యూ చేస్తే ఎలా?" సరదాగా అన్నాడు మణి, మనోజ్‌ను ఆటపట్టిస్తూ.

"అదేమిట! తనూజ అంతరిక్షంలో వేలాడు తోంది... మార్చుకో తల్లీ! నీ బ్యాగ్రౌండ్ ఫొటో... పెద్ద బాసు చూస్తే... కొత్త టార్గెట్స్ యిచ్చి ఆకాశం తాకేలా పెంచేస్తాడు..." మనోజ్ కూడా మణి బాటలో సరదాగా అన్నాడు తనూజను చూస్తూ జూమ్‌లో.



"ఆడపిల్ల కదా!... చెల్లెమ్మ తనూజ ఎపుడూ చక్కగా అలంకరించుకునే ఉంటుంది చక్కగా!" మెచ్చుకోలుగా చెప్పాడు మంజునాథ్.

పెద్ద బాస్ హరిశ్చంద్ర జాయిన్ అయ్యాడు.

"గుడ్ మార్నింగ్ ఆల్!...ఎలా ఉన్నారు అందరూ?"

ఆ కంఠస్వరం వింటేనే భయపడిపోతారు అందరు.

"గుడ్ మార్నింగ్ సార్!" అంటూ అందరూ ఒకేసారి అన్నారు.

గుడ్ మార్నింగ్ అన్నపుడు కృష్ణ లింక్ నుంచీ పెద్ద అరుపులు వస్తున్నాయి.

"యాపిల్... బత్తాయి పళ్ళు...తాకాపళ్ళు... సగం రేటు..." అంటూ.


"ఏమిటిదీ?...సైడ్ బిజినెస్ ఏమన్నా స్టార్ట్ చేసారా?"


కంచుకంఠం గంభీరంగా అంది.

రోడ్డు పక్కనే ఇల్లు కావడంతో హాలులోఉన్న కృష్ణ వెంటనే మ్యూట్ నొక్కేసాడు.

"తనూ! కొంచెం కాఫీ కలిపి మామ గారికి వ్వమ్మా! కాఫీ పడకపోతే గెంతులేస్తారు." తనూజ అత్తగారి కంఠం అందరికీ వినబడు తోంది.

తనూజా కూడా సరె సరే... అని సైగ చేస్తూ మ్యూట్ పెట్టేసింది.





"మొత్తానికి ఇంట్లో పనీ, ఆఫీస్ పనీ బాగానే ఎంజాయ్ చేస్తున్నారన్నమాట!..." అంటున్న హరిశ్చంద్ర ఫోన్‌మోగింది. వాయిస్ అందరికీ వినబడుతోంది.

అవతల మానవ వనరుల శాఖాధిపతి అడిగిన ప్రశ్నకు జవాబుగా– "కొత్త రిక్రూట్మెంట్ అక్కరలేదు... రోజూ ఇంట్లోనే పని వల్ల ప్రొడక్టివిటీ పెరుగుతోంది...రానూ పోనూ సమయం మిగిలింది. ఆన్లైన్‌లో అన్నీ జరిగిపోతున్నాయ్. కరోనా తర్వాత కూడా వర్క్ ఫ్రమ్ హోమ్ సాగిద్దాం..." అని చెప్పి ఫోన్ పెట్టేసాడు హరిశ్చంద్ర ఆర్డర్ ఇచ్చే స్వరంతో.

'అవును! ప్రతీ ఒక్కరూ రోజుకు మూడు గంటలైనా ఎక్కవే చేస్తున్నారు రాత్రనకా పగలనకా... ఇక కొత్తవాళ్ళ అవసరమేముంటుంది?' అనుకున్నాడు మనసులో రఫీఖ్.

రఫీఖ్‌కు రోజూ ఆఫీస్‌కు వెళ్ళడమే ఇష్టం. ప్రకృతిని చూస్తూ అలా ప్రయాణం చేయడం... ఆఫీస్‌లో అందరూ చుట్టూ ఉంటే అదో అనుభూతి. అది ఇపుడు దొరకడంలేదు... వారంపాటు బాగా అనిపించినా వర్క్ ఫ్రమ్ హోమ్ ఇపుడు విసుగనిపిస్తోంది రఫీఖ్‌కి.

అందరి మనసుల్లో అదే ఉంది.

"మంజునాథ్... ఏడీ మాధవ్?... ఈ రోజు లేడా?" అడిగాడు హరిశ్చంద్ర.

మాధవ్ హరిశ్చంద్ర రికమండేషన్‌తో చేరిన వాడే. అందుకే అడిగాడు ప్రత్యేకంగా.

"సార్! వాడికి ఇంటర్నెట్ ప్రాబ్లమ్ అండి ఒకసారి వస్తుంది ఒకసారి రాదు అది ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదంటాడు మాధవ్!" ఆన్సర్ ఇచ్చాడు మంజునాథ్.

అదే సమయంలో బాస్ వెనకనుంచీ పెద్ద శబ్దాలు వినిపిస్తున్నాయి... వంటింట్లోంచి కాబోలు గరిట ధభీమని కింద పడేసిన శబ్దం.

"మీకు మీటింగ్ లెక్కువైనాయ్... టిఫినీకి ఆ ఉల్లిగడ్డలు తరిగి ఇవ్వమన్నానా?... ఈ రోజు పని మనిషి కూడా రాలేదు కరోనా అని చెప్పింది కదా... మీరిక చెయ్యరా? మీ ఆఫీసు కాదిది. కాస్తంత వళ్ళు కదిలించండి!" గట్టిగా అదమాయిస్తున్న హరిశ్చంద్ర భార్యామణి కంఠం.

వెంటనే మ్యూట్ పెట్టడం ఇపుడు బాస్ హరిశ్చంద్ర వంతయింది.

"ఓ పదిహేను నిముషాల తర్వాత కలుద్దాం! ఎవరో వచ్చారు." చెప్పి ఆఫ్ చేసాడు బాస్.

అదేం విచిత్రమో... భార్య అరవడం వినే వాళ్ళు...'ఓహో!...అన్నిచోట్లా ఇంతేనా...' అని బాస్‌కూ తప్పదురా నాయనా...మా పులి కూడా ఇంట్లో పిల్లి అన్నమాట అనుకుంటూ ఒకటే నవ్వు అందరూ.

ఆన్‌లైన్‌లో తెలిసి పోయిందని... ఆఫీసే బాగుంది అనుకుంటున్న హరిశ్చంద్ర మొహంలో కవళికలు మారుతున్నాయి.

"మాతోటే మా బాసూనూ" అనుకుంటూ పాట పాడేస్తున్నాడు కృష్ణ.

నవ్వాపుకోలేక ఎగిరిగంతులేస్తున్నాడు జూమ్‌లో వీడియో బంద్ చేసిన మణి.

అందరూ బాస్ రీ ఎంట్రీలో వస్తే ఎలా ఉంటారో చూడాలని తెగ ఆతృతగా ఉన్నారు ఆన్‌లైన్ లో!!

### లాఫ్ లైన్స్

**అభాగ్యుడికి ఆకలెక్కువ..**
**ఫేస్ బుక్ వాడేవారికి**
**నిద్ర తక్కువ!**



# గుబులు కుమారి

కోనే నాగ వెంకట ఆంజనేయులు,
9290660220

**"ఈ నెల పద్దెనిమిదో తేదీన పిల్లలతో సహా మీ  యింటి మీద దండయాత్రకు వెడలి వచ్చేస్తున్నామహో" అంటూ పద్మ దగ్గర నుండి ఫోన్ వచ్చిన దగ్గర నుండీ కుమారిలో మళ్లీ గుబులు సెగ రాజుకుంది.**

**పద్మ- కుమారి ఆడపడుచు. పిల్లల పరీక్షలు అయిపోగానే వేసవి సెలవులకు పుట్టింటికి వచ్చి పదిహేనో, యిరవై రోజులో కులాసాగా గడిపి వెళ్లడం రివాజు పద్మకు.**

వాళ్ళు వస్తున్నారని తెలియగానే కుమారి గుండెల్లో రాయి పడింది. పద్మ తల్లి అంటే కుమారి వాళ్ళ అత్తగారు ఎప్పుడో బకెట్ తన్నేసినా... పద్మ పుట్టింటికి రావడం మానేయ లేదు... ఇప్పుడది తన రాజ్యం కావడంతో... పద్మ ఎప్పుడు పుట్టింటికి వచ్చినా... అన్న గారింటి మీద పడి తినేయడానికి వస్తున్నట్లుగా భావిస్తుంటుంది కుమారి.


ఆమెకు గల అనేక గుబుళ్లలో యిదొకటి.

యింటికి వచ్చిన ఆడపడుచుకు చీర... జాకెట్ పెట్టి పంపడం ఆచారం కదా... అది కాకుండా పిల్ల పిశాచాల చేతుల్లో వంద నోటో రెండొందల నోటో కూడా పెట్టక తప్పదాయె. ఇవన్నీ కాకుండా వాళ్ళు ఉన్నన్ని రోజులూ వాళ్ళ తిండీ, తిప్పలూ, సినిమాలకూ, షికార్లకూ తిప్పడం...  యివన్నీ తడిపి మోపెడు. అమ్మో! అమ్మో!! ఎంత ఖర్చు!!!

ఇదే కుమారిలోని గుబులుకి కారణం.

పోనీ వాళ్ళు లేని వాళ్ళా అంటే... లక్షలు సంపాదించే ఉద్యోగం కుమారి వాళ్ళాయనది. కానీ కుమారి చేతి నుంచి పైసా రాలదు ఎంత దగ్గరి వాళ్ళకి పెట్టాలన్నా! ఎవరికైనా రూపాయి పెట్టాలంటే పదహారు విధాల ఆలోచించే తత్వం ఆమెది.






అందుకే కుమారి తమ యింటికి ఎవరైనా వస్తున్నారని తెలియగానే ఉపయోగించే... ఎప్పటికీ పదును తగ్గని... అస్త్రాన్ని బయటకు తీసింది.

పద్మా వాళ్ళింకా నాలుగు రోజుల్లో బయలు దేరుతున్నారనగా ఫోన్ చేసింది కుమారి.

"పద్మా! మీ ఊళ్ళో రగ్గులు చవకట కదా! నువ్వు వచ్చేటప్పుడు ఓ నాలుగు రగ్గులు పెద్దవి కొనుక్కురా. నువ్వు యిక్కడికి రాగానే డబ్బులు యిచ్చేస్తాలే." అంటూ హామీ కూడా యిచ్చింది.

కుమారి సంగతి తెలిసిన పద్మ ఆ మాట వింటూనే షాక్ తిని కాసేపు తరువాత తేరుకుని 'సరే వదినా' అన్నది నీరసం ముంచుకు రాగా.

ఇలాగే యింతకు ముందు కూడా ఓసారి మీ ఊళ్ళో చవకట కదా అని యింటిల్లి పాదికీ స్వెట్టర్లు తెప్పించుకుంది గానీ వాటి తాలూకు డబ్బు ఊసే ఎత్తలేదు ఆమె ఉన్నన్ని రోజులూ... చివరికి ఆడపడుచు వెళ్లి పోయేటప్పుడు బొట్టు పెట్టి, చీరా, జాకెట్ చేతిలో పెడుతూ... 'అన్నట్టు పద్మా స్వెట్టర్లకు ఎంత యిందన్నావ్!' అని అడిగింది తెలివిగా.

ఓ వైపు 'ఊరికే' చీరా, జాకెట్ తీసుకుంటూ స్వెట్టర్లు తీసుకువచ్చినందుకు డబ్బులు తీసుకోవడం ఏం బావుంటుందని మొహమాటంతో 'అదేంటి వదినా భలే దానివేలే... ఆ స్వెట్టర్లకి నువ్వు డబ్బులివ్వాలా! వదినకు ఆ మాత్రం తీసుకువచ్చే అధికారం కూడా లేదా ఈ ఆడపడుచుకు' అంటూ నిష్ఠూరం నటించింది పద్మ ఒళ్ళు మంటని ఒంట్లోనే దాచుకుని.

తను అనుకున్నదే జరగడంతో కుమారి లోని గుబులు పారిపోయింది తాత్కాలికంగా.

ఈ సారి కూడా తాను పెట్టే చీరా, జాకెట్ ఖరీదు తిరిగి రాబట్టుకోవడానికే కుమారి వేసిన ఎత్తు యిదని అర్థమై పోయింది పద్మకు.

కానీ చేసేది లేక వదిన అడిగిన రగ్గులు కొని రైలెక్కింది.

పద్మని చూడగానే ఆలింగనం చేసుకుని–

"రా పద్మా! ఎలా ఉన్నారు?... ప్రయాణం అదీ బాగా సాగిందా?" అని తియతీయగా అడుగుతూ... సాదరంగా ఆహ్వానించింది కుమారి... మనసులోని చేదుని అక్కడే నొక్కి పట్టి.

"బావున్నాం వదినా!" అంటూ పద్మ తను తీసుకు వచ్చిన రగ్గులున్న బేగ్ కుమారి చేతికి అందించింది.

చేటంత ముఖం చేసుకుని ఆనందంగా ఆ బేగ్ అందుకుని రంగులు చూసుకుని మురిసి పోయింది కుమారి.

అన్నగారి యింట్లో యిరవై రోజులు కులాసాగా గడిచి పోయాయి.


చెల్లి ఉన్నన్ని రోజులూ రోజూకో రకం పిండి వంటతో విందుభోజనాలు ఏ లోటూ లేకుండా ఏర్పాటు చెయ్యకపోతే ఊర్కోనంటూ కుమారిని ముందే హెచ్చరించాడు ఆమె భర్త.

అందుకే ఆడపడుచుకు ఏ లోటూ రాకుండా చూసుకోవాల్సి వచ్చింది. మనసులో లబలబ లాడుతూనే కుమారి.

ఊరగాయలు పెట్టడంలో స్పెషలిస్ట్ అయిన కుమారి పెట్టిన ఆవకాయ, మాగాయ, ఉసిరి

## లాఫ్ లైన్స్

**కొందరు బిచ్చగాళ్లకు గర్ల్ ఫ్రెండ్స్ ఉండడం చూసాను. తెలిందేమిటంటే... వారొచ్చాకే, వీరు బిచ్చగాళ్ళు అయ్యారట.**



'కాయ' ఊరగాయలు నోరూరించాయి పద్మను. రోజుకో రకం ఊరగాయతో మొదటి ముద్దలు గొంతు దిగక పోతే ఆ రోజు భోజనం చేసినట్టే ఉండేది కాదు పద్మకు.

రోజు రోజుకూ బరువు తగ్గించుకుంటున్న పచ్చడి జాడీలను చూస్తుంటే... కుమారిలో గుబులు మరింత పెరిగిపోతుండేది.


అవును మరి ఈసారి పచ్చళ్లకు యిరవై వేల పై మాటే ఖర్చయింది.

ఇంకా పుట్టింటికి కూడా పంపక ముందే తరిగిపోతున్న ఊరగాయలు కుమారిలోని గుబులును మరింత పెంచుతున్నాయి.

రోకళ్ళతో దంపించిన శ్రేష్ఠమైన ఎర్రెర్రని గుంటూరు మిరపకాయల కారం, దగ్గరుండి చెక్క గానుగలో ఆడించిన నువ్వుల నూనెతో శ్రద్ధతో పెట్టుకున్న ఊరగాయలు మరి అవి.

చూస్తుండగానే మూడు సినిమాలూ, ఆరు షికార్లుగా యిరవై రోజులు యిట్టే గడిచి పోయినట్లు పద్మకూ, భారంగా గడిచినట్లు కుమారికీ అనిపించాయి.

తిరుగు ప్రయాణానికి టికెట్లు ముందే రిజర్వ్ అయిపోయాయి కాబట్టి... తనవీ, పిల్లలవీ బట్టలు బేగుల్లో సర్దుకోవడం మొదలు పెట్టింది పద్మ.




'ఇంకా కొద్ది రోజులు ఉండండి అత్తా' అని గారాబాలు పోతున్న తన కొడుకు, కూతుర్ల మాటలు కుమారిలో గుబులు రేకెత్తించాయి.

"మళ్ళీ సెలవులకు వస్తాంగా!" అని పద్మ మేనల్లుడినీ, మేనకోడలిని బుజ్జగించిన తరువాతే శాంతించింది కుమారి మనసు.

బొట్టు పెట్టి వదిన పెట్టిన చవక రకం చీర, జాకెట్ గుడ్డ చూసి చిట్లించిన ముఖాన్ని వెంటనే అతికించేసుకుంది పద్మ.

"ఇప్పుడివన్నెందుకులే వదినా?" నొచ్చుకోలు నటిస్తూ అన్న పద్మ మాటల్ని కొట్టేస్తూ-

"భలే దానివే పద్మా!... ఆచారాన్ని పాటించ వద్దా మరి! లేకపోతే మీ అన్నయ్య ఊరుకోరు కదా! అవునూ రగ్గులకు ఎంతివ్వాలి?" అంది కుమారి ముఖంలో నవ్వు అంటించుకుని.

"బాగుంది వదినా!... కప్పుకునే రగ్గులకు వెల కడతావా?... ఏం వద్దు గానీ... అన్నట్టు వదినా మర్చేపోయాను. మా అత్తగారికి నువ్వు పెట్టే ఊరగాయలు ఎంత యిష్టమో తెలుసా?... క్రితంసారి నువ్వు బుల్లి తేనె సీసాతో యిచ్చిన ఆవకాయ ఎంత నచ్చిందో మా అత్తగారికి. నిన్ను అడిగి ఊరగాయలు తీసుకు రమ్మని కేరేజీలు కూడా సర్దేరు బేగ్‌లో!" అంది పద్మ.

కుమారి అయిష్టంగానే అటక మీద నుంచి జాడీలు దింపించింది.


"పచ్చళ్ళు నేను సర్దుకుంటానులే... నువ్వు వెళ్లి వంట పని చూసుకో వదినా! భోజనాలు చేసి వెంటనే స్టేషన్‌కి పరిగెత్తాలి కదా!..." అంటూ పద్మ, కుమారిని వంట గదిలోకి బలవంతంగా గెంటేసింది.

మూడు స్టీలు కేరేజ్‌లలో ఆవకాయ... మాగాయ... ఉసిరి'కాయ' ఊరగాయలు నూనెతో సహా నింపుకుంది పద్మ.

పిల్లలతో 'టాటా' చెప్పించి పద్మ ఆటో ఎక్కి స్టేషన్ కి బయలు దేరి వెళ్లి పోయిన తరువాత ఊరగాయల జాడీలు అటక ఎక్కించే ముందు జాడీల మూతలు తెరిచి చూసింది కుమారి.

అడుగు మేర తగ్గిపోయిన ఊరగాయ జాడీలను చూసి లబోదిబోమందా గుబులుకుమారి.

రైలెక్కి సీటు కింద సర్దుకున్న అడుగున్నర పొడవున్న మూడు ఊరగాయ కేరేజీలను చూసి 'తిక్క కుదిరిందా వదినమ్మా' అనుకుంటూ విజయ గర్వంతో నవ్వుకుంది పద్మ.





# శకునాల శంకర్రావు

బుద్ధవరపు కామేశ్వరరావు, 9848047322

**సకినాల శంకర్రావు ఇల్లు ఎక్కడ అంటే ఆ ఊర్లో ఎవరికీ తెలియకపోవచ్చు, కానీ శకునాల శంకర్రావు ఇల్లు అంటే చాలు, సునాయాసంగా ఎక్కడో చెప్పేస్తారు.**

✦ ✦ ✦

శంకర్రావుకి, ఇంటర్లో చిన్నమొక్కలా మొదలైన ఈ శకునాల పిచ్చి, డిగ్రీలోకి వచ్చేటప్పటికి మహావృక్షంలా ఎదిగి పోయింది.

ఆ శకునాల పిచ్చికి వాస్తు, మూఢనమ్మకాలు కూడా తోడయ్యాయి.

అవి ఎంతలా ముదిరిపోయాయంటే, అనకూడదు కానీ, వాష్‌రూమ్‌కి వెళ్ళడానికి వర్జ్యం, దుప్పటి కప్పుకోవడానికి దుర్ముహూర్తం, లైటు ఆర్పడానికి లగ్నం చూసుకొనేటంతగా!

డిగ్రీ రెండవ సంవత్సరం పరీక్షలు రాయడానికి వెళ్తే, పేపర్ మీద పెన్ను పెట్టే సమయానికి ఇన్విజిలేటర్ తుమ్మిందని, పరీక్ష మానేసి వచ్చేటంతగా!

ఎలాగైతేనేం మొత్తం మీద డిగ్రీ పూర్తి చేసి, అదే ఊరిలో చిన్న ఉద్యోగంలో సెటిలయ్యాడు శంకర్రావు.

✦ ✦ ✦

ఆ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన కొడుకుతో–

"ఒరే శంకరం!... ఈ రోజు నీకు ఓ పెళ్లి సంబంధం వచ్చిందిరా!...అమ్మాయి బాగుంది. మన వీధిలోనే వాళ్ళ ఇల్లు. నువ్వు 'ఊ' అంటే ఓ రెండు రోజుల్లో చూడ్డానికి వెళ్దాం!" చెప్పింది అతని తల్లి సోదెమ్మ.

"అమ్మా! ఇప్పుడు రాహుకాలం నడుస్తోంది. తర్వాత మాట్లాడుకుందాం!..." పంచాంగం చూడకుండానే చెప్పాడు శంకర్రావు.

"నడుస్తున్నది రాహుకాలం కాదురా!...నీకు పొయ్యేకాలం. ఈ వయసులో ఈ చాదస్తం ఏమిట్రా? శకునపక్షీ!" అంటూ విసుక్కుంది.

✦ ✦ ✦

రెండు రోజుల తర్వాత...

"ఏరా శంకరం! అమ్మ చెప్పిన సంబంధం గురించి ఏమాలోచించావు. నేను అన్ని వివరాలు సేకరించా! మనకు అన్ని విధాలా అనుకూలమైన సంబంధం. నువ్వు ఒప్పుకుంటే అమ్మాయిని చూడడానికి వెళ్దాం." కొడుకు శంకర్రాన్ని బతిమాలాడు తండ్రి నాంచారయ్య.

"సరే నాన్నా! అలాగే వెళ్దాం...అవునూ! ఇంతకీ ఆ పెళ్లి వారిల్లు మనముంటున్న ఈ ఇంటికి ఏ వైపు ఉంటుంది?" సందేహం వ్యక్తం చేసాడు శంకర్రావు.

"కుడి వైపు ఉంటుందిరా !" కొడుకు వైపు అనుమానంగా చూస్తూ చెప్పాడు తండ్రి.

"అబ్బే!... నాకు ఆ సంబంధం కుదరదు నాన్నా! ఎందుకంటే, నా జాతకం ప్రకారం నేను చేసుకోబోయే అమ్మాయి...నేను ఉంటున్న ఇంటికి ఎడమవైపున్న ఇంటి నుంచి రావాలి. కుడివైపు నుంచి కాదు!" ఏవో కూడికలు, తీసివేతలు వేళ్ళ మీద లెక్కించి చెప్పాడు శంకర్రావు.

కొడుకు ఆఫీసుకి వెళ్ళగానే–

"ఏమిటండీ వీడు? పెళ్లి చేస్తే బాగుపడతాడు అనుకుంటే వీడిలా మాట్లాడుతున్నాడు?" బాధ పడుతూ భర్తను అడిగింది సోదెమ్మ.

"చూద్దాం! కంగారు పడకు... ఏదో మార్గం ఆలోచిద్దాంలే!" అంటూ ఆమెను సమాధాన పరిచాడు నాంచారయ్య.

✦ ✦ ✦

ఓ వారం తరువాత, ఎదురుగా ఉన్న ఓ ఖాళీ ఇంట్లోకి మారిపోయింది నాంచారయ్య కుటుంబం.

ఓ పది రోజుల తర్వాత...

"ఏరా శంకరం! మొన్న అమ్మ చెప్పిన సంబంధం గురించి ఏమాలోచించావు?" కొడుకును అడిగాడు నాంచారయ్య.


"చెప్పాను కదా నాన్నా!... నా జాతకానికి అమ్మాయి ఎడమ వైపు ఉన్న ఇంటి నుంచి రావాలి, కుడివైపు నుంచి కాదు అని!" అసహనంగా చెప్పాడు శంకర్రావు.

"ఔను నిజమే బాబూ! కానీ, ఇప్పుడు మనం



## లాఫ్ లైన్స

భార్యాభర్తల్లో
ఎప్పుడూ ఒక్కరి వైపే
గెలుపుంటుంది.
మిగిలిన వైపు భర్త ఉంటాడు



ఇల్లు మారేం కదా?... అందుచేత అమ్మాయి ఎడమవైపు ఉన్న ఇంటి నుంచే వస్తుంది!" చల్లగా చెప్పేడు తండ్రి.

తండ్రి సమాధానంతో ఉక్కిరిబిక్కిరి అయ్యి, కిక్కురుమనకుండా పెళ్లికి సిద్ధమయ్యేడు శంకర్రావు.

✦ ✦ ✦

ఎందుకైనా మంచిదని శంకర్రావు తండ్రి, పెళ్ళికూతురు రమకి, ఆమె తండ్రికి, తన కొడుకు శకునాల పిచ్చి గురించి ముందే చెప్పడంతో, రెండు కుటుంబ పెద్దలు ఓ అంగీకారానికి వచ్చి నష్టనివారణ చర్యలు యుద్ధ ప్రాతిపదిక మీద చేపట్టారు.

పెళ్లిలో ఎవరు తుమ్మినా అది శంకర్రావుకు వినపడకుండా సన్నాయి మేళాన్ని అతని చెవి పక్కనే కూర్చుని వాయించి, అతని కర్ణభేరికి కన్నాలు పడేలా ఏర్పాటు చేసారు.

అంతే కాకుండా, పిల్లులను పట్టుకొనే వాళ్ళను రప్పించి, ఆ వివాహ మండపాన్ని మార్జాల రహిత ప్రదేశంగా తీర్చిదిద్దేరు.

అలాగే పంతులు గారు తన ముక్కు పొడెం డబ్బాను మూడురోజులు పాటు బయటకు తీయకుండా కట్టుదిట్టం చేసారు.

ఇన్ని ఏర్పాట్లు చేయడంతో పెళ్లి బాగానే జరిగినా, శోభనం రోజున మాత్రం గొడవ పెట్టాడు శంకర్రావు.

గదిలోకి పెళ్ళికూతురిని తీసుకుని పేరంటాలు వస్తున్న సమయంలో, పంతులు గారు తన భుజం మీద ఉన్న తువ్వాలుని ఘాట్టిగా ఓసారి ఝూడించి మళ్ళీ భుజం మీద వేసుకున్నారు.

ఆ ధాటికి ఎన్నో రోజులుగా ఆ తువ్వాలు మీద స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న కొన్ని ముక్కుపొడి రేణువులు వెళ్లి, పెళ్లి కూతురు మేనత్త ముక్కుపుటాలను ఆశ్రయించాయి.

ఆ దెబ్బకి ఆవిడ స్లాబులు కూలిపోయేంత గట్టిగా తుమ్మింది!

అంతే!... అంతవరకూ మంచం మీద గోతి కాడ నక్కలా కూర్చున్న శంకర్రావు ఒక్క ఉదుటున మంచం మీంచి దూకి గది బయటకు వచ్చి పడ్డాడు.

"చూడు నాయనా!... మంచి ముహూర్తం. తుమ్ము, ఉమ్ము అంటూ ఈ ముహూర్తం వదులుకోకు!" నచ్చ చెప్పారు పంతులు గారు.


"చూడండి! పంతులు గారూ! మీరు సకల శాస్త్ర ప్రవీణులు' అయివుండవచ్చు కానీ నేను 'శకున శాస్త్ర ప్రవీణుడిని'. నాకు ఇలాంటి పట్టింపులు చాలా ఎక్కువ!..." అంటూ ఆ రోజును వాయిదా వేసాడు.

మర్నాడు రాత్రి మాత్రం పంతులు గారితో సహా అందరూ తుమ్ములు బయటకు రాకుండా మొహాలకు మాస్కులు కట్టుకుని... ఒకవేళ వచ్చినా, అవి శంకర్రావుకు వినబడకుండా అతని చెవిలో (ముక్కులో కాదు) మాంఛి బలంగా దూది కుక్కి, మొత్తం మీద ఆ కార్యక్రమాన్ని మమ అనిపించేరు.

✦ ✦ ✦

పెళ్లి అయ్యి వేరే కాపురం పెట్టిన తర్వాత రమకి పూర్తిగా తెలిసొచ్చింది తన భర్త శంక





[శంక]రావు యొక్క శకునపక్షి చేష్టలు.

✦ ✦ ✦

మొదటి రోజు, ఆఫీసుకి బయలుదేరే ముందు– "ఇదిగో రమా! ఆ సందు చివర వరకూ వెళ్లి, ఆ పక్క సందుల్లోంచి ఎవరూ ఎదురు రాకుండా చూసి, నాకు ఎదురు రా!" భార్యకు చెప్పాడు శంకర్రావు.

"ఆ చివర వరకూ ఎందుకండీ? ఓ పది అడుగులు వెళ్లి, ఎదురు వస్తే సరిపోతుంది కదా?" అమాయకంగా అడిగింది రమ.

"నో! నో!! నా జాతకం ప్రకారం నాకు కనీసం ఓ వంద అడుగులు దూరంలో చెడు ఎదురు రాకూడదు!" కరాకండీగా చెప్పాడు శంకర్రావు.

"అవునూ! అదేమిటండీ ఆ చెవుల్లో అలా రక్తాలు కారేలా గుడ్డలు కుక్కేసుకున్నారు?" చెవి దగ్గరకు వెళ్లి చూసి, భయం భయంగా అడిగింది రమ.

"ఓ అదా ! ఎవరు తుమ్మినా నాకు వినపడ కుండా చేసుకున్న ఏర్పాట్లు. సరే కానీ, సందు చివరకు వెళ్ళి ఎదురు రా !!" అని చెప్పడంతో గతిలేక ఓ పది నిమిషాలు ట్రాఫిక్ కానిస్టేబుల్ అవతారం ఎత్తి, చివరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

✦ ✦ ✦

చాలా నెలలుగా శంకర్రావు శకునాల పిచ్చితో విసుగెత్తి, దీని నుంచి ఇతడిని ఎలా బయటపడేయాలా అని ఆలోచిస్తున్న రమకు ఓ రోజు చక్కటి అవకాశం వచ్చింది.

✦ ✦ ✦

ఆ రోజు...

ఉదయం బాత్రూమ్‌లో స్నానం చేస్తున్న శంకర్రావు సెల్‌కు అతని కొలీగ్ గోపాలం నుంచి ఫోన్ వచ్చింది.

ఫోన్ తీసిన రమ–

"హలో... అన్నయ్య గారూ! నేను రమని. ఆయన స్నానం చేస్తున్నారు... ఏమైనా చెప్పాలా?"

"అవునమ్మా! మూడు శుభవార్తలు. అవి ఏమిటంటే మీ ఆయనకు జీతం పెరిగింది, రెండవది ప్రమోషన్ వచ్చింది. మూడవది, ముఖ్యంగా మీ ఆయనను వేధిస్తున్న ఆ మేనే జర్‌కు బదిలీ అయ్యింది. ఇప్పుడే హెడ్ ఆఫీసు వాళ్ళు నాకు ఫోన్ చేసారు." ఆనందంగా చెబు తున్నాడు గోపాలం.

ఆ మాటలు వింటున్న రమకు వెంటనే ఓ ఆలోచన వచ్చి–

"అన్నయ్య గారూ!... నాకు ఓ సహాయం చేయాలి. అదేంటంటే, మీరు ఈ విషయాన్ని మా ఆయనకు అప్పుడే చెప్పకండి. ఆఫీసుకి వచ్చిన ఓ గంట తరువాత చెప్పండి. ఇలా చేయడం వలన నన్ను రక్షించిన వారవుతారు. మిగతా విషయాలు తరువాత చెబుతాను!" అంటూ రమ ప్రాధేయ పడడంతో...


"ఔనా!... సరే అలాగేనమ్మా!" అని ఫోన్ పెట్టేసాడు గోపాలం.

వెంటనే తన మొబైల్ తీసి, మూడిళ్ళు అవ తల ఉన్న పార్వతికి ఫోన్ చేసి–

"అక్కా! నేను రమని... చిన్న సహాయం

**లాఫ్ లైన్స**

**సెల్-ఫోను కొందరికి-**
**టెల్-ఫోను...**
**కొందరికి హెల్-ఫోను...**
**ఇంకొందరికి సొల్లు-ఫోను!**



చేయాలి అక్కా!... ఏంటంటే...కొంచెం సేపట్లో మా ఆయన ఆఫీసుకు బయలుదేరే సమయం లో మీ పెంపుడు నల్లపిల్లిని ఆయనకు ఎదురు వచ్చేలా వదిలేయి... ఎందుకు ఏమిటి అనే విషయాలు తరువాత చెబుతాను. మరచి పోకు'' అని బతిమాలడంతో ఆమె కూడా "సరే" అని ఫోన్ పెట్టేసింది.

రోజూలాగే ఆఫీసుకు బయలుదేరిన శంకర్రావుకు రమ కంటే ముందు ఓ నల్లపిల్లి ఎదురొచ్చింది.

బిత్తరపోయి చూసి... వెనక్కి రాబోతున్న శంకర్రావుకు...


"ఓ సారి ఇంటి నుంచి బయలుదేరిన తరువాత తిరిగి వెనక్కి రాకూడదని శాస్త్రం చెబుతోంది" అని ధైర్యం చెప్పి, తిరిగి ఆఫీసుకు పంపించింది రమ.

✦ ✦ ✦

సాయంత్రం ఇంటికి వచ్చిన శంకర్రావు–

"రమా! ఈ రోజు మూడు శుభవార్తలు..." అంటూ ఆనందంగా ఆ వివరాలు చెప్పేడు.

"ఎంత మంచి వార్తలు చదివారండీ...అదే చెప్పారండీ... అవునూ! మీకో విషయం తెలుసా? ఈ రోజు మీకు శకునం వచ్చింది నేను కాదు. నల్లపిల్లి. అందుకే మంచి జరిగిందేమో? నా మాట విని ఇప్పటినుంచైనా ఆ శకునాల పిచ్చి తగ్గించుకోండీ..." గారంగా చెప్పింది రమ.




"ఔను రమా! నిజమే సుమా!... నాకూ జ్ఞాపకం వచ్చింది... అయితే ఈ శకునాల గురించి ఇంకోసారి ఆలోచించాల్సిందే'' అంటూ ఏదో ఆలోచిస్తూ చెప్పాడు శంకర్రావు.

తన పాచిక పారినందుకు ఆనందపడి పోయింది రమ.

✦ ✦ ✦

మర్నాడు సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన శంకర్రావు చంకలో ఉన్న రెండు నల్ల పిల్లులను చూసి బిక్కచచ్చిపోయింది రమ.


భార్య వైపు కృతజ్ఞతగా చూస్తూ–

"నిన్న నువ్వు చెప్పింది నిజమే రమా! ఆ నల్లపిల్లి శకునం రావడం వలనే నాకు మూడు శుభవార్తలు తెలిసాయి. అందుకే వీటిని కొని తెచ్చా! రేపటి నుండి శకునం నువ్వు వద్దు, ఇవే రావాలి శకునంగా!" ఆనందంగా చెప్పాడు శకునపక్షి.

"సరే కానీ... రెండు ఎందుకండీ?" కొంచెం తేరుకున్న తరువాత అడిగింది రమ, మనసులో రగిలిపోతూ.

"అయ్యో వెర్రి రమా! నిన్న ఒక పిల్లి శకునం వస్తేనే మూడు శుభవార్తలు విన్నాం. రేపటి నుండి ఈ రెండు పిల్లలు ఎదురొస్తే...ఇక పండగే పండగ..."

ఆనందంగా చెప్పుకుపోతున్న శకునాల శంకర్రావు మాటలు వినే స్థితిలో లేదు రమ. ఆమె ఆలోచనల్లా మళ్లీ ఏ పథకం వేసి ఇతని శకునాల పిచ్చి మాన్పించాలా అని!




## లాఫ్ లైన్స్

హీరోయిన్ లిరిక్స్-
"చేతిలో చెయ్యేసి చెప్ప బావా..."
హీరో లిరిక్స్-
"చెయ్యి కడుక్కున్నావా...
మరదలా?"

# పెళ్ళి బాగోతం

భాగవతుల భారతి ,8121712950

**శారదా ఎన్ క్లేవ్ ...**

**"ఆగండీ!...నో!... ఈపెళ్ళి జరగటానికి వీల్లేదు!" పెళ్ళి కొడుకు అరుపుకి, ఉలిక్కిపడి ఉరిమిచూసి– "ఈడైలాగ్ నీ తాత లాగూలేయక ముందునుండీ వింటున్నా. విషయం ఏమిటిరా? " అంది బామ్మ .**

**"పెళ్ళికి ఆక్సిజన్ సరఫరా ఉన్న కల్యాణ మంటపంలో మాత్రమే పెళ్ళి జరపాలని పెళ్ళిముచ్చట్లలో మాట్లాడుకున్నాం కదా!" ఒక్క క్షణం ఆగి...**

"అంత ఆక్సిజన్ సప్లై, ఖర్చు భరించలేక ఇదిగో! ఈ 'కరోనా' వాళ్ళనాన్న ఈ ఎన్‌క్లేవ్ లో పెళ్ళి పెట్టాడా? అందుకే ఎవరూ రాలేదా! ఆక్సిజనే సరఫరా చేయలేని వాళ్ళు ఆడపిల్లలను ఎందుకు కనాలీ?" పెళ్ళి కొడుకు కోవిడ్ ఉచ్చం నీచం మరిచి చిందులు తొక్కాడు.

"ఏంటండీ ఆ మాటలు! శుభలేఖ అందరి వాట్సప్‌లకూ పంపినప్పుడే ఎవరి ఆక్సిజన్ సిలెండర్ వాళ్ళవీపుకు కట్టుకురావాలని మెసేజ్ పెట్టేసాగా... అయినా లాంఛనాలు మాట్లాడేటప్పుడు, ఇవి మాట్లాడామా?" పెళ్ళి కూతురు తండ్రి వాక్సిన్‌రావు పోట్లాటకు దిగాడు.

"ఇవన్నీ మా రోజుల్లో మేం ఎరగం. ఎంచక్కా మూతికి మాస్క్‌లు బిగించి, సానిటైజర్‌లు పూసుకుంటూ, సామాజిక దూరం పాటించుకుంటూ, వందమంది వరకూ పెళ్ళికి హాజరయ్యే వాళ్ళం. ఇదేమిటో ఆ మాస్క్‌లూ పోయాయ్... అన్నీ పోయి ఆక్సిజన్ సిలెండర్‌ల దగ్గరకొచ్చాం..." పెళ్ళి కొడుకు తల్లి మూతిముడిచింది.

"మీరు చెప్పేది ఎప్పటిమాట?... పాతికేళ్ళ క్రితం మాట. అయ్యో అయ్యో! అదేమిటీ ఆ పురోహితుడు గారు కళ్ళు తేలవేసి ఒరిగి పోతున్నారూ... పట్టండీ ఏదన్నా హాస్పిటల్‌కి!"

"హాస్పటల్‌కి వెళ్ళే వరకూనా!.. ఆ జాడిలో నవకాయ పిండివంటల, కాప్సూల్స్ ఉన్నాయ్! ఒకటి తెచ్చి వేయండి." పెళ్ళి కొడుకు అరిచాడు.

"మా రోజుల్లోనా ఎంచక్కా పిండివంటలూ, బఫేలూ, ఇప్పుడవేవీ లేవు. కరోనా గోలకి, పౌష్టికాహారం పేరుతో మాత్రల్లో కూరేసి...!"

"యహే! ఆగండమ్మా మీ గోల!... అవతల ముహూర్తానికి ఏ పెళ్ళి జరగక చస్తున్న ఈ రోజుల్లో! మన 'కోవిడ్' దీ 'కరోనా' పెళ్ళి నన్నా జరిపిద్దామంటే, శ్వాస ఆడక చస్తుంటే."



పెళ్ళికొడుకు తండ్రి చిరాకు పడ్డాడు.

"ఈ పేర్లేమిటో! మా రోజుల్లో, ఎంచక్కా దేవుళ్ళ పేర్లు పెట్టుకునేవాళ్ళం." అంది బామ్మ.

"నీ పెళ్ళి నా మాస్కల్లే ఉందీ... నా పెళ్ళికి వచ్చి టీకా వేయమన్నట్లుంది. వెధవ సంత! నేను పోతున్నా!!" పెళ్ళి కొడుకు బెదిరించాడు.

"బెదిరింపులు నీకేనా! నాకూ అక్కర్లా ఈ పెళ్ళి!!" పెళ్ళికూతురు కరోనా మూతి ముప్పై వంకర్లు తిప్పింది.

"అయ్యో! హయ్యో!! మా రోజుల్లో పెళ్ళి అయ్యాక కాపురాలు చేస్తారో లేదో నమ్మకం ఉండేది కాదు. ఇప్పుడు పెళ్ళిళ్ళే జరుగుతాయో లేదో నమ్మకం ఉండట్లేదూ!"

వియ్యపురాళ్ళనబడే ఇద్దరూ కోరస్‌లో అరిచారు.

"ఛీ! ఊపిరి ఆడట్లా! ఆక్సిజన్ సిలెండర్ కోసం పోతున్నా!" తలుపు తీసుకుని బయటికి పోయాడు పెళ్ళికొడుకు.

"కోవిడూ!... బయట స్ట్రెయిన్ ముప్పయ్యోవేవ్ నడుస్తోంది... మాస్కన్నా పెట్టుకుపోరా! ప్రమాదం రా!! రేయ్ బాబూ! రేయ్ బాబూ!!" అని అరుస్తూ మంచం మీద నుండి క్రింద పడ్డాడు సన్యాసిరావు.

"ఏరా! సన్నాసీ! ఏంట్రా పట్టపగలే కలవరింతలు!" సన్యాసిరావు మేమమామ కుదుపులకు కళ్ళుతెరిచి–

"నా కొడుకూ...నా కొడుకూ..." అరుస్తూ దిగ్గున లేచాడు సన్యాసిరావు.

"రేయ్! సన్నాసీ! పెళ్ళి కాకుండానే కలవరింతలా? రాత్రికి పెళ్ళి! ముస్తాబు చేయటానికి, ముత్తయిదువలు వచ్చారు... డెట్టాల్‌తో స్నానం చేసి, మూతికి మాస్క్ బిగించి తగలడు!"అన్నాడు మేమమామ.


అంటే ఇదంతా కలా!... పాతికేళ్ళ తర్వాత నిజంగానే ఇలా ఉండబోతోందా? ఊహకే... ఇంత భయంగా ఉంది. బాబోయ్! వాక్సిన్ వేయించుకున్నాక వచ్చే ఒళ్ళు నొప్పుల్లా మెలి దిరిగిపోయాడు పిచ్చి సన్నాసి.


# మాటల్లేక్...


కార్టూన్ ప్రక్రియలో కష్టతరమైన ప్రక్రియ 'క్యాప్షన్‌లెస్ కార్టూన్లు'.
మన కార్టూనిస్టుల 'క్యాప్షన్‌లెస్ కార్టూన్లు' ఇకనుండి ప్రతినెలా మీ కోసం ప్రత్యేకం!

నిర్వహణ:
నాగిశెట్టి






**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది.

**ప్రస్తుతం...**

**"చెప్పను!"**

**"చెప్పవా?!..." అన్నాడు పిడికిలి బిగిస్తూ.**

**"ఆపరేషన్ చేసి నీ ఎడమ మోకాలికి వేసిన రాడ్ మీదొట్టు... చెప్పను!" అంది.**

**ఓలే గజగజ వణుకుతూ- "అయ్యో! ఇదెక్కడి ఖర్మ!" అన్నాడు ఏడుపు మొహంతో.**

**సౌమ్య మళ్ళీ విజిల్ వేయసాగింది.**

**"సరే... సరే... తెస్తాను. ఏ సైజ్ బట్టలు తేవాలి? ఎక్కడ తేవాలి?"అన్నాడు.**

**"ఫెండీ గానీ ఆర్మానీ గానీ ఐతే బెటర్. డాల్చే అండ్ గబానా ఐనా అడ్జెస్ట్ అవుతాను!" అంది.**

"ఏంటివి?... అమ్మాయిలు ప్యాంట్, టాప్, టీ-షర్ట్, ఫుల్‌షర్ట్, స్కర్ట్... ఇలాంటివి కదా వేసుకుంటారు. మీ ఇండియన్స్ ఐతే సారీ కట్టుకుంటారు." అన్నాడు.

"అవి దుస్తులు కాదు. దుస్తుల బ్రాండ్స్!" అంది.

"ఏంటి బ్రాండ్సా? ఇంట్లోనే, ఈ బ్రాండ్స్ పిచ్చి భరించలేక చస్తుంటే..మళ్ళీ నీ గోల ఒకటా?"

"తెస్తావా? తేవా?" అంది.

"సరే ఏడుస్తాలే... ఎక్కడ దొరుకుతాయి?" అన్నాడు.

ఆమే, ఓ నాలుగైదు షాపింగ్ మాల్స్ పేరు చెప్పింది. ఆ తర్వాత తన సైజ్‌కు సరిపోయే నెంబర్స్ చెప్పింది.

ఓలే బయటికి వెళ్ళి అరగంటలో మాడి పోయిన మొహంతో వచ్చాడు.

"తేలేదేంటి?" అంది.

"రేట్లు మినిమం ఐదొందల డాలర్స్ నుండి ప్రారంభం ఔతున్నాయి. నీకు టాప్-ప్యాంట్ తేవాలంటే, ఖర్చు వెయ్యి డాలర్స్‌కు పైగా అవుతోంది. అంత డబ్బు నా దగ్గరలేదు." అన్నాడు.

"నీ బ్యాంక్ నుండి డ్రా చెయ్యి."అంది.

"ఉన్న తక్కువ డబ్బు ఖర్చు చేస్తే, నెలా ఖరుకు బిల్స్ ఎలా కట్టాలి? ఈ సరికి వాల్-మార్ట్‌లో తెస్తాను. అడ్జెస్ట్ అవ్వు!" అన్నాడు.

"కుదరదు!" అంది.

"నిన్ను ఎవడు చేసుకుంటాడో కానీ, మూడు రోజులో ఇంటి గోడ దూకి పారిపోతాడు!" అన్నాడు ఓలే సీరియస్‌గా.

ఆమె ఏమీ అనలేదు. మూడు నిమిషాల నిశ్శబ్దం తర్వాత... ఓలే అడిగాడు-

"ఇంతకూ నా భార్యకు, ఆంటోనియోకు గొడవ ఎందుకు అయ్యింది? మళ్ళీ... వాళ్ళు ఎందుకు కలిసారు?"

సౌమ్య సమాధానం చెప్పలేదు.

ఓలే జుట్టు పీక్కొని... "కాస్త నా మీద దయ చూపించు!" అన్నాడు.

"సరే. కష్టపడకు. మా ఇంటికి వెళ్ళి, నా బెడ్‌రూం వార్డ్ రోబ్‌లో ఉన్న... నా బట్టలు తీసుకొని రా! స్నానం చేసి, ఆ బట్టలు వేసు కొని, కాస్త పూజ చేసుకొని అప్పుడు చెప్తాను!" అంది.

"మీ ఇంటి దగ్గర పోలీసులు ఉంటే?"

"ఉండనీ..."

"నన్ను అరెస్ట్ చేస్తే?!"


"చెయ్యనీ..."


ఓలే అటు ఇటు కాలుగాలిన పిల్లిలా కాసేపు తిరిగి- "సరే! ఓసారి వెళ్ళి చూస్తా... ఎవరూ లేకపోతే తెస్తాను!" అన్నాడు.

"ఇంటి తాళం బద్దలు కొట్టకు! ఇంటి ఆవ రణలో చాల మొక్కలున్నాయి. పచ్చ గులాబీ మొక్కలున్న కుండీలో తాళం చెవి ఉంటుంది!" అంది.

"అదేంటి?" అన్నాడు.

"ఇంట్లో ఉండేది నేనూ, నాన్న. ఇద్దరి దగ్గర చెరో తాళం చెవి ఉంటుంది. ఒక తాళం చెవి, నా కారు తాళం చెవి కీచెయిన్ కు ఉంటుంది. నువ్వు నన్ను కిడ్నాప్ చేసినప్పుడు, అది నా కారులో ఉండిపోయింది. ఇక మా నాన్నగారు ఇంట్లో లేరు. నిన్న ఉదయం డల్లాస్ వెళ్ళారు. సోమవారం వస్తారు. ఇద్దరిలో ఎవరైనా కీ మర్చిపోయి వస్తే, ఇబ్బంది పడకూడదని, ఆ పూలకుండీలో మూడో కీ దాచి ఉంచుతాం!" అంది.






"సరే! వెళ్ళి చూస్తానుఔ" అనేసి, ఆమె ఇంటి అడ్రస్ తెలుసుకొని... ఆమె ఇంటికి బయల్దేరాడు.

✦ ✦ ✦

ఆమె ఇల్లు ఓ ఇండిపెండెంట్ హౌజ్.

దూరాన కారు పార్క్ చేసి, వాకింగ్ చేసిన ట్లుగా ఆ కాలనీలో నడుస్తూ చూస్తాడు.

ఎక్కడా పోలీసు వాహనాలు కనిపించలేదు.

అటూ ఇటూ చూస్తూ, రక్కున ఆ ఇంటి కాంపౌండ్ వాల్ దూకి, పసుపు గులాబీ మొక్క లున్న పూలకుండీ నుండి తాళం చెవి తీసు కొని, శరవేగంగా తాళం తీసి లోపలికి ప్రవేశిం చాడు. చాలా పెద్ద ఇల్లు. ఐదు బెడ్ రూములు, ఇంటినిండా ఫర్నీచర్. సామాన్లు.

"ఉండేది ఇద్దరు... ఇంత పెద్ద ఇల్లు ఎందుకో?" అని మనసులో అనుకుంటూ, సౌమ్య బెడ్ రూం ఎక్కడుందో వెతికాడు.

ఆమె వార్డ్ రోబ్ తెరవబోతుంటే, బయట కారు ఆగిన శబ్దం వినిపించడంతో, ఆగి పోయాడు.

ఒక రెండు నిమిషాల తర్వాత ఎవరో తాళం తీస్తున్న శబ్దం వినిపించడంతో, సౌమ్య బెడ్ రూంలో ఉన్న బాత్ రూంలో దూరాడు.

సౌమ్య తండ్రి, లోపలికి వచ్చి... ఫ్రిజ్‌లో నీళ్ళు తాగి, నింపాదిగా తన బెడ్‌రూంలోకి వెళ్ళి రివాల్వర్ చేతుల్లోకి తీసుకున్నాడు.

"నా చేతిలో రివాల్వర్ ఉంది. ఇంట్లో ఎవరో ఉన్నారన్న విషయం నాకు తెలుసు. మర్యాదగా వాళ్ళెవరో బయటికి రండి!" అన్నాడు.

అది వినగానే ఓలే గుండెల్లో రాయి పడినట్ల యింది.

"మీ అంతట మీరు వస్తే ఏమీ అనను... నేను వెతికిన కనిపిస్తే మాత్రం... నా తుపాకీ మాట్లాడుతుంది." అన్నాడు.

ఓలేకు ఏం చేయాలో అర్థం కాలేదు.

సౌమ్య తండ్రి ఒక్కో గది చూస్తూ... సౌమ్య బెడ్ రూం లోకి వచ్చాడు.

బాత్ రూం తలుపు మీద కొడుతూ...

"బయటికి వస్తారా! లేక షూట్ చెయ్యానా? చాలా పవర్ఫుల్ రివాల్వర్ ఇది! బాత్ రూం తలుపు చెక్క దీనికి అడ్డు రాదు!" అన్నాడు.

ఓలే తలుపు తెరిచి, రెండు చేతులు పైకి ఎత్తి నిలబడ్డాడు.

"ఏంటి సంగతి?" అన్నాడు సౌమ్య తండ్రి నింపాదిగా.

"సార్! అదీ... అదీ... అర్జెంట్‌గా బాత్ రూం కు వెళ్లాల్సి వస్తే మీ ఇంట్లో దూరాను సర్!" అన్నాడు ఓలే భయంగా.

"మరి... కాలకృత్యాలు తీర్చుకున్నావా?"

"ఇంకా లేద్సార్! ఈలోపు మీరొచ్చారు!"

"సరే ఐతే... పనికానిచ్చి రా!" అన్నాడు సౌమ్య తండ్రి.

"రివాల్వర్ చూడగానే ఆగిపోయింది సార్. రావడం లేదు!" అన్నాడు.


"సరే... ఏంటి కథ?" అన్నాడు.

ఓలే గజగజ వణుకుతూ చూడసాగాడు.

"నా టైం వేస్ట్ చెయ్యకు. విషయం చెప్పు."

"సార్... ఏదో బుద్ధి గడ్డి తిని మీ అమ్మాయి ని కిడ్నాప్ చేసాను సార్!" అన్నాడు ఏడుస్తూ.

"........"




## లాఫ్ లైన్స్

**కోడలికి కంప్యూటర్**
**జాగ్రత్తలు చెప్పి...**
**అత్త కంప్యూటర్‌లో వైరస్**
**డౌన్లోడ్ చేసిందట.**

"అదీ... కిడ్నాప్ చేయాల్సింది మీ అమ్మాయిని కాద్సార్! పొరపాటున మీ అమ్మాయిని ఎత్తుకొచ్చాను. ఫోటో మారిపోయింది సార్!"

"........"

"సర్! పోలీసులకు ఫోన్ చేయొద్దు సర్. మీ అమ్మాయి ఎక్కడుందో చెప్పేస్తాను సర్!" అన్నాడు ఏడుపు గొంతుతో.

"అసలు... నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావ్?" అడిగాడు సౌమ్య తండ్రి.

"సార్! మీ అమ్మాయి స్నానం చేసి, విడిచిన బట్టలు వేసుకోవడానికి సిద్ధంగా లేద్సర్!... అందుకే, బట్టలు తెమ్మంటే... వచ్చాను సార్! అంతే సార్!!"

"షాప్‌లో కొనుక్కుని వెళ్ళొచ్చుగా?"

"అంత డబ్బు నా దగ్గర లేద్సార్! ఏదో... కిరాయికి కిడ్నాపులు చేసుకునేవాడిని!..." అన్నాడు ఏడుస్తూ.

"సరే సరే ఏడవకు! మా అమ్మాయి బట్టలు తీసుకో!" అన్నాడు సౌమ్య తండ్రి.

"సార్..." అని ఆశ్చర్యంగా చూసాడు ఓలే.

"తీసుకోవయ్యా! మా అమ్మాయి బట్టలు తీసుకో! అన్నట్టు బ్యాగ్ లాంటిది ఏమైనా తెచ్చుకున్నావా?"

"లేద్సార్!..."

"సరే... నేను ఇస్తాలే. పసుపు రంగు టాప్, బ్లాక్ జీన్స్ తీసుకో. ఆ దుస్తులు మా అమ్మాయికి చాలా ఇష్టం... మా అమ్మాయి వాడే పెర్ఫ్యూమ్,మేకప్ కిట్ కూడా తీసుకెళ్ళు... ఓ రెండు మేగజైన్స్ ఇస్తాను. తీసుకెళ్ళు... చదువుకుంటుంది. అడ్డమైన చెత్త ఫుడ్ పెట్టకు. వెళ్ళేటప్పుడు, ఇండియన్ రెస్టారెంట్ బిర్యానీ తీసుకెళ్ళు. డబ్బులు నేనిస్తాలే!" అన్నాడు సౌమ్య తండ్రి.

ఓలే షాక్ తిన్న వాడిలా చూస్తూ... అలాగే ఆగిపోయాడు.

"ఊc!...త్వరగా కానివ్వు!" అన్నాడు.

ఓలే, సౌమ్య వస్తువులు, బట్టలు ఓ బ్యాగ్‌లో సర్దుకొని, ఆయన ఇచ్చిన రెండు వందల డాలర్లు తీసుకొని..."సార్! నేను బయటికి వెళుతుంటే... వెనక నుండి కాల్చి చంపారు కదా?" అన్నాడు సందేహంగా.

"నీ బొంద! నేనేమైనా పోలీసునా? కాలిస్తే ఈ పాటికి కాల్చేవాడిని కదా?"

ఓలే తన జేబులో ఉన్న ఇంటి కీ ని ఆయనకు ఇస్తూ– "లోపలికి రాగానే ఇంట్లో ఎవరో ఉన్నారని ఎలా కనిపెట్టారు సార్?"అన్నాడు.

"కొన్ని సీక్రెట్ కోడ్స్ ఉంటాయి. అవన్నీ నీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు!"

"సార్!... మీ అమ్మాయి అంటే మీకు కోపమా?"

"లేదు!"

"మరి... మేము ఆమెకు ఏమైనా చేస్తామనే భయం మీకు లేదా?"

"లేదు!"

"ఆమెను ఎప్పుడు వదులుతాం... లాంటి ప్రశ్నలు కూడా మీరు వెయ్యడం లేదేంటి సార్?"

"మీకు ఇష్టమున్నప్పుడు వదిలెయ్యండయ్యా!" అన్నాడు.

"సార్! మీ అమ్మాయి ప్రవర్తన..మీ ప్రవర్తన చూస్తుంటే పిచ్చెక్కుతోంది సార్!" అన్నాడు.

**(సశేషం)**

## రాష్ట్ర స్థాయి జోకులు / స్కిట్ పోటీ

**సుప్రసిద్ధ కథకులు ET రామారావు గారి స్మారక కమిటీ మరియు దాసరి క్రియేషన్స్ యూట్యూబ్ ఛానెల్ సంయుక్తం గా నిర్వహిస్తున్న జజోకులు/ స్కిట్జ పోటీకు జోకులు స్కిట్‌లు వీడియో రూపంలో ఆహ్వానిస్తున్నారు.**


**వీడియో నిడివి : 3 నుండి 5 నిమిషాలు ఉండాలి.**

**వీడియోలు ఫోను అడ్డంగా ఉంచి రికార్డు చేయాలి.**

**మొత్తం పది నగదు బహుమతులు ఉంటాయి.**

**వీడియోలను పంపవలసిన వాట్సాప్ నంబర్ 9440407381**

**వీడియోలు పంపుటకు చివరి తేదీ జూలై 20**








**భార్య ఏడుపు...**

**పక్కింటి అమ్మాయి చిరునవ్వు**

**అతిపెద్ద అణ్వాయుధాలు**





Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P






With Jaquar Taps

Best Cartoon of the Month





**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

Hasyanandam July 2021. RNI No. APTEL 08387/01/1/2003-TC

# ఆహ్వానము




## సత్కళాభారతి, హాస్యానందం సంయుక్తంగా నిర్వహిస్తున్న

# 2021 తెలుగు కార్టూనిస్టల దినోత్సవ సభ

**ఆదివారం, జులై-11, 2021, సాయంకాలం 6గంటలకు**
**రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్**

## మీతో పాటు ముఖ్య అతిధులు


డా॥ కె.వి.రమణ
తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు


శ్రీ మామిడి హరికృష్ణ
డైరెక్టర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ


శ్రీ తనికెళ్ళ భరణి,
ప్రఖ్యాత నటులు, రచయిత


శ్రీ జనార్ధన మహర్షి
ప్రఖ్యాత రచయిత, దర్శకులు


శ్రీ వి.సుబ్బరాజు
బాపురమణ అకాడమీ


శ్రీ బి.ఎస్.శర్మ
సభ నిర్వాహకులు

## హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల బహుమతి ప్రదానోత్సవం


| తలిశెట్టిరామారావు స్మారక కార్టూన్ పోటీ విజేతలు: | విశిష్ట బహుమతులు పొందిన కార్టూనిస్టులు |
|---|---|
| మొదటి బహుమతి- నాగ్రాజ్<br>రెండవ బహుమతి- వర్మ<br>మూడవ బహుమతి- జెన్నా | కృష్ణ ✦ రామ్‌శేషు ✦ అర్జున్ ✦ వినోద్ ✦ వడ్డేపల్లి వెంకటేష్ ✦ ప్రేమ్ ✦ పూతేటి ✦ శేఖర్ ✦ ప్రసిద్ధ ✦ టి.ఆర్.బాబు ✦ బాచి ✦ రంగాచారి ✦ గుత్తుల శ్రీనివాసరావు ✦ శ్రీ ✦ చక్రవర్తి ✦ అరుణ్ ✦ భగవాన్ ✦ సీతారామ్ ✦ పైడి శ్రీనివాస్ ✦ సురేంద్ర |


| శేఖర్ అవార్డు-2021 | బాపురమణ పురస్కారం-2021 | రాగతిపండరి పురస్కారం-2021 |
|---|---|---|
| ప్రభాకర్ | లేపాక్షి | శ్రీమతి రమాదేవి |


ఇంకా...

- ముళ్లపూడి కథల పోటీ విజేతలకు....
- సినీ కార్మికులు- కార్టూన్ పోటీ విజేతలకు...
- అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీ విజేతలకు...

**బహుమతి ప్రదానం**


జి. సత్యనారాయణ
సత్కళాభారతి


జ్ఞిం
సమన్వయకర్త


రాము.పి
హాస్యానందం

## నవ్వడం ఇష్టపడే అందరూ రావచ్చండోయ్!

మాస్క్‌తో రావటం మాత్రం మర్చిపోకండి!